



మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 158 | కర్నూలు | మంగళవారం 21-07-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

## దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
## విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
## పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ,జూలై20(శ్రీచక్ర) పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# రిజిస్ట్రేషన్ సేవలను సులభంగా పొందేందుకే RSKల ఏర్పాటు: సీఎం చంద్రబాబు



అమరావతి, జులై 20(శ్రీచక్ర) : ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయబోతున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల అంశం ప్రస్తావనకు వచ్చింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంటే... కొందరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-ఖీఖిలను ఏర్పాటు చేస్తున్నామని... ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని చెప్పారు.పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని సీఎం వెల్లడించారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల ఏర్పాటుతో పాస్ పోర్టు ప్రాసెసింగ్ సులభతరమైందన్నారు. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను సులభంగా పొందవచ్చని అన్నారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా సేవలు సులభతరంగా పొందడంతో పాటు.. మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని చెప్పుకొచ్చారు. ప్రజలకు సేవలందించేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోంటే... కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం అధికారులు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా ఆదాయ మార్గాలు చూపెడతామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోండి..

## కేంద్ర మంత్రులకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి, జులై 20(శ్రీచక్ర) : ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ముగ్గురు కేంద్ర మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు లేఖలు రాశారు. సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వాలని కోరారు. అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం అవసరమని లేఖలో తెలిపారు. డీజీఎఫ్‌టీ ద్వారా ఫిష్ మీల్ ఎగుమతిని నియంత్రించాలన్నారు.

# 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

## నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు
## ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు అని, శ్రీనివాస్



విజయనగరం,జూలై20(శ్రీచక్ర) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లను అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు హోం మంత్రి కీలక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రధాని పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. గత పదేళ్ల వరకు ఒక సాధారణ గ్రామంగా ఉన్న భోగాపురం ఇప్పుడు రూపురేఖలు మారాయి. విమానాశ్రయం ఏర్పాటుతో నేడు ఉత్తరాంధ్ర ప్రగతికి మణిహారం కాబోతోంది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెదేపా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించింది. అప్పట్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవ, ఎన్డీయే ప్రభుత్వం అనుమతితో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అప్పటి వైకాపా ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. 2023 మే 23న ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఏడాదికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కేంద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగింది. సుమారు రెండున్నరేళ్లలో విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యింది. ఆగస్టు ఒకటిన ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఉత్తరాంధ్ర వాసుల సహా రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉపాధికి ఈ ప్రాజెక్టు ఊతమివ్వనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వివిధ సందర్భాల్లో పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామిక, రవాణా రంగాలు భావితరాలకు బంగారు భవిత అందించనున్నాయి. 136 ఎకరాల్లో జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీ విమానాశ్రయానికి అనుబంధంగా ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడ పైలట్లు, రక్షణ రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం సహా ఇతర భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ప్రధానమైన అభివృద్ధి కేంద్రంగా మారనుంది. త్వరలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సముద్ర సంపద, ఔషధాల తయారీ ముడిసరకుల ఎగుమతులు.. ఇక్కడకు అవసరమైన సరకుల దిగుమతులతో రాష్ట్ర ప్రధాన పారిశ్రామిక, రవాణా కేంద్రంగా అవతరించనుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు, పర్యాటకులతో భారత విమానయాన పరిశ్రమలో కీలక పాత్ర పోషించనుంది. విమానాశ్రయం చుట్టూ ఒక నగరాన్ని నిర్మించే ప్రతిపాదన ఉంది. ఇందులో పారిశ్రామిక మండలం, విమానయాన, విద్య, ఆరోగ్య సంరక్షణ మండలాలు నెలకొల్పాలని యోచిస్తున్నారు. 139 ఎకరాల్లో జీఎంఆర్ టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టనున్నారు.

# కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

## తన జీవితమే అందుకు ఉదాహరణ
## మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు,జూలై20(శ్రీచక్ర) చదువుతో పేదరికాన్ని జయించవచ్చని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. తాను ట్యూషన్స్ ప్రారంభించి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో షైనింగ్ స్టార్ అవార్డ్స్ - 2026లో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు, బహుమతులు పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. యువనేత నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఉద్ఘాటించారు. విద్యార్థులు ఈ మార్పులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపునిచ్చారు.తన కష్టంతోనే ఈ స్థాయికి వచ్చానని మంత్రి నారాయణ ప్రస్తావించారు. తాను పదోతరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయ్యానని వెల్లడించారు. పదోతరగతి ఫెయిల్ తనలో పట్టుదల పెంచిందని చెప్పుకొచ్చారు. డిగ్రీ మూడేళ్లల్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచానని తెలిపారు. స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని వెల్లడించారు. వీఆర్సీలో పార్టు టైం లెక్చరర్‌గా రూ.40ల జీతానికి పనిచేశానని వివరించారు. మూడు నెలలకు గానూ రూ.120ల జీతం ఇస్తే తాను తీసుకోలేదని వెల్లడించారు. ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం ఇచ్చినా తాను రాజీనామా చేశానని ప్రస్తావించారు.

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

## నేడు ఏపిలో అక్కడక్కడా వర్షాలు

అమరావతి,జూలై20 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర కోస్తా ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోనున్నట్లు వెల్లడించింది. కోస్తాంధ్రలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. మేఘావృత వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ప్రాంతం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో అత్యధికంగా 66.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అలాగే పెంజెరువులో 42.5 మిల్లీమీటర్లు, సోమలింగపాలెంలో 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలు, పిడుగులు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో అలాగే భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. అలాగే సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున చిన్న పడవలతో వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు.

# ఏపీ యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు: మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, జులై 20(శ్రీచక్ర) జైపూర్ లో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్ తో మంత్రి కందుల దుర్గేష్ భేటీ అయ్యారు. ఏపీకి రండి అని యువతకు గైడ్స్ గా శిక్షణ ఇవ్వండి అని టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కు అధికారిక ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్ టూరిస్ట్ గైడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు విశేష ప్రాధాన్యం కల్పించిందని.. అందులో భాగంగా పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10,000 మంది యువతకు టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఆల్ ఇండియా టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి వారిని ప్రొఫెషనల్ టూర్ గైడ్స్‌గా తీర్చిదిద్దాలని మంత్రి దుర్గేష్ ఆయనను కోరారు. తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పర్యాటక సేవలను మెరుగుపరచడంతో పాటు, స్థానికంగా పర్యాటక రంగంలో వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం , వారికి శిక్షణను అందించేందుకు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని ఫెడరేషన్ ప్రతినిధులను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.

# సంపాదకీయం

## భార్యల చేతిలో భర్తల 'బలి'.

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది. అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ‌గ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడా నికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటా యని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

## కర్నూలులో సందడి చేసిన జబర్దస్త్ నటి వర్ష

**బళ్లారి చౌరస్తాలో ఎంఆర్పీ టీవీఎస్ నూతన షోరూం ప్రారంభోత్సవం**




కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఆర్పీ టీవీఎస్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ, టెలివిజన్ నటి, జబర్దస్త్ ఫేమ్ వర్ష ముఖ్య అతిథిగా హాజరై షోరూం ప్రారంభించి సందడి చేశారు. ఈ సందర్భంగా వర్ష మాట్లాడుతూ కర్నూలు నగరానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ఘన స్వాగతం పలికిన కర్నూలు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. టీవీఎస్ సంస్థ గురించి ప్రత్యేకంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదని, నాణ్యత, విశ్వసనీయతతో ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన డిజైన్లు, విభిన్న రంగుల్లో టీవీఎస్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. తాను కూడా వ్యక్తిగతంగా టీవీఎస్ వాహనాన్నే ఉపయోగిస్తున్నానని తెలిపారు. కర్నూలు ప్రజలు ఎంఆర్పీ టీవీఎస్ షోరూం సందర్శించి తమకు నచ్చిన ద్విచక్ర వాహనాలను ఎంపిక చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా అభిమానులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షతో ఫోటోలు దిగుతూ సందడి చేశారు. షోరూంలో అందుబాటులో ఉన్న తాజా మోడళ్లను పరిశీలించి ఆమె నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ మోటార్ కంపెనీ రీజనల్ మేనేజర్ సుప్రీత్ సింగ్, ఏరియా మేనేజర్ రవి వంశీ కృష్ణ, రోనాల్డ్ రోబర్ట్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రత్యామ్నాయ ప్రణాళికలతో నివేదికలు సిద్ధం చేయాలి**
**రైతులకు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**
**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**





నంద్యాల, జూలై 20 (శ్రీచక్ర): ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పంట నష్టాలు సంభవించకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంపై ప్రభావాన్ని అంచనా వేసి, రైతులు నష్టపోకుండా, ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో చేపట్టాల్సిన చర్యలను స్పష్టంగా పొందుపరిచిన సమగ్ర నివేదికలను సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, జలవనరులు, భూగర్భ జలాలు తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులకు సూచించడం, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలను ముందుగానే అందుబాటులో ఉంచడం, నీటి వినియోగంలో పొదుపు చర్యలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని, పంటల స్థితిగతులపై నిరంతరం సమాచారం సేకరించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.


## కర్నూలు జిల్లా జైలులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ 'ప్రిజన్ స్మార్ట్' కార్యక్రమం విజయవంతం





కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా జైలులో ఖైదీల మానసిక ప్రశాంతత, ఒత్తిడి నివారణ, వ్యక్తిత్వ వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకుని వారం రోజుల పాటు నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ? ప్రిజన్ స్మార్ట్ కార్యక్రమం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయులు జే. లక్ష్మీ నారాయణ, శరత్ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖైదీలు సుదర్శన క్రియ, యోగా, శ్వాస వ్యాయామాలు, ధ్యానం వంటి అంశాల్లో శిక్షణ పొందారు. ఈ సాధనల ద్వారా మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం పెరిగిందని వారు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖైదీల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఖైదీల నుంచి వచ్చిన సానుకూల స్పందన ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ఒత్తిడి, కోపం, ఆందోళనలను అధిగమించి మానసిక ప్రశాంతతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సేవలను అందించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఖైదీలు మాట్లాడుతూ, సుదర్శన క్రియ తమలో కొత్త ఆశ, ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ఇకపై ప్రతిరోజూ ఈ సాధనను కొనసాగిస్తూ మంచి జీవితాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలర్ జి. ఏరిక నాయుడు, డిప్యూటీ జైలర్ డి. నాగరాజు, సి. అయ్యవారు రెడ్డితో పాటు జైలు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో జైలు అధికారులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు ఖైదీలలో సానుకూల మార్పులకు దోహదపడతాయని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్యవేడు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాల సమర్పణ



సత్యవేడు,జూలై 20( శ్రీచక్ర):సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం జిల్లా కలెక్టర్‌ను, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాలను కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ సమక్షంలో మంత్రి అనగాని దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఆదిమూలం, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. వినతులను స్వీకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కార మార్గం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ సీనియర్ నాయకులు ఇలన్ గోవన్ రెడ్డి, గోపినాథ్ రెడ్డి, రవి రెడ్డి, లోకయ్య రెడ్డి, కరుణాకర్ నాయుడు, సుధాకర్ నాయుడు, ఈశ్వరయ్య, యాచంద్ర నాయుడు, నరేంద్ర, మాజీ జెడ్పీటీసీ సుమాంజలి,పిఏసిఎస్ చైర్మన్ నందకిషోర్ రెడ్డి, అవసరం సురేష్, బాలాజీ, మాజీ ఎంపీపీ మురళి, దయాలన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దిశ ఒన్ స్టాప్ కేంద్రం, శక్తి సదన్ ను తనిఖీ చేసిన న్యాయమూర్తి






కర్నూలు లీగల్, జులై 20 (శ్రీ చక్ర ): కర్నూలు ప్రభుత్వ జనరల్ వైద్యశాలలోని దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తి సదన్)ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్లను న్యాయమూర్తి పరిశీలించారు. వన్ స్టాఫ్ సెంటర్లో చేరే వారి వివరాలు, రికార్డులను సక్రమంగా మెయింటైన్ చేయాలని అలాగే సంబంధిత అధికారుల సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. బాధితులకు విక్టిమ్ కంపెన్సేషన్ త్వరగా అందేలా కృషి చేయాలని అక్కడికి సిబ్బందిని ఆదేశించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న నివాసితులకు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. వారి భోజన వసతి సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా చట్ట పరమైన సమస్యలు వస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## రాఘవేంద్రపురంలో.. తాగునీటి బోరు



మంత్రాలయం , జూలై 20,(శ్రీచక్ర) : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లోని రాఘవేంద్రపురం కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు , ఎంపిటిసి మేకల వెంకటేష్ అన్నారు. గత కొన్ని నెలలుగా రాఘవేంద్రపురం కాలనీలో నీటి సమస్య ఉందని కాలనీ వాసులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ తాగునీటి సమస్యను మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టి కి ఎంపిటిసిమేకల వెంకటేష్ , టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు తీసుకువెళ్ళారు. స్పందించిన ఆయన వెంటనే కాలనీలో బోర్ వేయించారు. అందులో భాగంగా సోమవారం కాలనీ బోర్ మోటార్ ఏర్పాటు చేసి కాలనీ వాసులకు తాగునీరు సరఫరా చేశారు. దీంతో కాలనీ వాసులు టీడీపీ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి కి , స్థానిక టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో ఉపేంద్ర రెడ్డి , టీడీపీ మండల సెక్రటరీ కమ్మసాలి నరసింహ , టీడీపీ నాయకులు మద్రి రఘు , పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## అక్షర పబ్లిక్ స్కూల్ చిన్నారులకు షైనింగ్ స్టార్ అవార్డులు!








బి ఎన్ కండ్రిగ, జూలై 20(శ్రీచక్ర):అక్షర పబ్లిక్ స్కూల్ లో చదువు కొన్న ఎం.వెన్నెల మొన్న జరిగిన పదవ తరగతి ఫలితాలు లో 583/600 మండలం లో మొదటి స్థానం సాధించడం తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రతిభ అవార్డ్ ప్రకటించడం జరిగింది. అదే రకం గా అక్షర స్కూల్ మరొక చిన్నారి ఎం.యోజన కు కూడా 577/600 ప్రభుత్వం వారు ప్రతిభ అవార్డు ప్రకటించడం జరిగింది. అందులో భాగంగా సోమవారం నాడు తిరుపతి లో కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్,జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యాశాఖధికారి సమక్షంలో ఇద్దరు చిన్నారులకు అవార్డు పురస్కారంతో పాటు ఇరవై వేల రూపాయలు పారితోషికం గౌరవ పెద్దలు సమక్షంలో లో ఇవ్వడం జరిగింది. ప్రతిభ పురస్కారం పొందిన ఇరువురు చిన్నారులను ఉపాధ్యాయ బృందం,పాఠశాల యాజమాన్యం, అభినందించారు

# ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ ఘన సత్కారం

**227 మంది మెరిట్ విద్యార్థులకు “షైనింగ్ స్టార్స్-2026” అవార్డులు ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకం, గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందజేసిన మంత్రి ఫరూక్**






నంద్యాల, జూలై 20 (శ్రీచక్ర): ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలుస్తారని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎండీ. ఫరూక్ అన్నారు. నంద్యాల పట్టణంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన “షైనింగ్ స్టార్స్ అవార్డ్స్?2026” జిల్లా స్థాయి ప్రధానోత్సవ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మెరిట్ విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా ప్రతిభను ప్రభుత్వం సమానంగా గౌరవిస్తోందన్నారు. విద్యార్థులు అందుకున్న నగదు ప్రోత్సాహకాన్ని ఉన్నత విద్య కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని, తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ మరవొద్దని విద్యార్థులకు సూచించారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, పేద విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యా నాణ్యత పెంపు వంటి పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో 16,347 మంది ఉపాధ్యాయులను డీఎస్సీ ద్వారా నియమించడం విద్యారంగానికి బలాన్నిచ్చిందన్నారు. పరీక్షలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అత్యధిక మార్కులు సాధించిన ఓ విద్యార్థినికి మూడు గ్రాముల బంగారు కమ్మలను బహూకరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు ప్రతిభను ప్రోత్సహించేందుకు “షైనింగ్ స్టార్స్” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యలో మరింత రాణించి దేశాభివృద్ధికి తోడ్పడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే సబ్జెక్టుపై లోతైన అవగాహన, విశ్లేషణాత్మక అధ్యయనం, ఆత్మవిశ్వాసం అవసరమని పేర్కొన్నారు.పిల్లలపై తల్లిదండ్రులు అనవసర ఒత్తిడి తీసుకురాకుండా వారి అభిరుచులు, సామర్థ్యాలకు అనుగుణంగా ఉన్నత విద్యను ఎంచుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి, ‘సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర’ కిట్లు, ‘డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం’, ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ నెల 24న నిర్వహించే మెగా పేరెంట్?టీచర్ మీటింగ్‌లో తల్లిదండ్రులందరూ పాల్గొనాలని కోరారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ “షైనింగ్ స్టార్స్” అవార్డు కేవలం నగదు ప్రోత్సాహకం మాత్రమే కాదని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమమని అన్నారు. అవార్డులు అందుకున్న వారిలో బాలికలు అధిక సంఖ్యలో ఉండడం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు పదో తరగతి లేదా ఇంటర్మీడియట్‌తోనే చదువు ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన పదో తరగతిలో 183 మంది, ఇంటర్మీడియట్‌లో 44 మంది కలిపి మొత్తం 227 మంది మెరిట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్ అందజేసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డిప్యూటీ డీఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నదుల కాలుష్యాన్ని అరికడదాం

**వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికే అప్పగించాలి**

**ఇంటింటి చెత్త సేకరణలో లోపాలుంటే ఫిర్యాదు చేయాలి**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): నదులు మన జీవనాధారమని, తాగునీరు, వ్యవసాయం, పర్యావరణ సమతుల్యతకు నదులు ఎంతో కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నదుల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి, ఇతర వ్యర్థాలను వేయకుండా నదుల కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కమిషనర్ యస్. నాగప్ప స్ట్రీట్, సాయిబాబా నగర్, శంకర మఠం, నవాబ్ బంగ్లా, ఖందేరి, పూల బజార్, పప్పుల బజార్, గడియారం ఆసుపత్రి, వెంకటరమణ కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అనంతరం నవాబ్ బంగ్లా సమీపంలోని తుంగభద్ర నదిని పరిశీలించి, నదీ తీరంలో ఉన్న అపరిశుభ్ర పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నదీ తీరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికే అప్పగించాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే హెల్ప్‌లైన్ నంబర్ 7422992299కు కాల్ చేయడం ద్వారా, వాట్సాప్ సందేశం పంపడం ద్వారా లేదా పురమిత్ర యాప్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. అంతేతప్ప ఎక్కడబడితే అక్కడ చెత్త వేయరాదని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఎస్.ఈ. రమణమూర్తి, డి.ఈ.ఈ. పవన్ కుమార్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకేష్, ముర్తుజావలి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా**



కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను అడిషనల్ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 130 ఫిర్యాదులు అందగా, ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులకు పంపిస్తూ, చట్టపరమైన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఫిర్యాదులను పూర్తిస్థాయిలో విచారించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అందిన ముఖ్య ఫిర్యాదులు:కర్నూలు గాయత్రి ఎస్టేట్‌కు చెందిన ఓ మెడికల్ షాప్ యజమాని తమ మెడికల్ ఏజెన్సీ నుంచి మందులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కొత్తపేటకు చెందిన రాజు ఫిర్యాదు చేశారు.మాధవి నగర్‌లో నివసిస్తున్న తన అల్లుడు రాజేష్ కుమార్ రెడ్డి కోర్టు విచారణలో ఉన్న ముగ్గురు సాక్షులను బెదిరిస్తున్నాడని, వారికి ప్రాణరక్షణ కల్పించాలని వెంకటరమణ కాలనీకి చెందిన ఓ మహిళ వినతిపత్రం అందజేశారు.దేవనకొండ మండలం నల్లచెల్లిమల గ్రామానికి చెందిన ప్రమీల, పొలంలో తనపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కర్నూలు నాగప్ప వీధికి చెందిన ఈశ్వరమ్మ, తన కుమారుడు, కోడలు తనను పట్టించుకోవడం లేదని, అన్నం కూడా పెట్టకుండా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సి. బెలగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన జయమ్మ, తన ఇంట్లో ఉన్న ఏడు సంచుల వరి బియ్యాన్ని ఎత్తుకెళ్లారని, దీంతో తాను, తన పిల్లలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని, నిందితులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.అందిన అన్ని ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఐలు శివశంకర్, రామాంజులు, మస్తాన్ వలి పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు సంతృప్తి చెందేలాగా పరిష్కారాలు అందించాలి

**పీజీఆర్ఎస్ అర్జీల ను గడువు లోగా పరిష్కరించాలి:జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**




కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): ప్రజల సమస్యలకు సంతృప్తి చెందేలా పరిష్కారాలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించటం ప్రభుత్వం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంకు ఆలస్యం లేకుండా, ప్రతి అర్జీ ని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే వారి సమస్యలకు ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. అపరిష్కృత వినతులన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించి, ఎలాంటి అర్జీలు మిగిలి పోకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



నందికొట్కూరు, జూలై 20 (శ్రీచక్ర): ఎమ్మెల్యే నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసుల మేరకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అందజేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖరరెడ్డి స్వగృహంలో పాముల పాడు మండలం వెంపెంట గ్రామం బి. పాంభీష్ కు రూ. 1,84,973 లు, నందికొట్కూరు కు చెందిన షేక్. అబ్దుల్ రసీద్ కు రూ. 2,09,243 లు, బండి ఆత్మకూరు మండలం జి. లింగాపురం కు చెందిన అంబటి. సుంకిరెడ్డికి రూ. 88500 లు ఇలా ముగ్గురికి మొత్తం 4,82,716 లక్షల చెక్కులు బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు.

## జూపాడుబంగ్లాలో ప్రారంభం కానున్న తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు






జూపాడుబంగ్లా, జూలై 20 (శ్రీచక్ర): తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక వ్యాప్తిలో భాగంగా మంగళవారం నుండి శనివారం వరకు మండల కేంద్రమైన జూపాడు బంగ్లాలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజులు జి.వేంకటరమణయ్యచే సాయంత్రం 6-00 గంటల నుండి ధార్మిక ప్రవచనాలు, 7-00 గం. నుండి స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10-00 గం.నుండి సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు ఇల్లూరి లక్ష్మీనారాయణ శ్రేష్ఠి, ఆలయ ధర్మకర్త మాకా వేంకట సుబ్బయ్య, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, అర్చకులు ఉమ్మయ్య, చిన్నతిరుపాలు, గోవిందప్పస్వామి, బాబు, రాము, రామయ్య, కృష్ణమూర్తి, నాగశేషులు, మల్లిఖార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల నిధుల కోసం పోరాటం కొనసాగుతుంది

**కోర్టుకు హాజరైన సర్పంచుల సంఘం నాయకులు**



కర్నూలు, జూలై 20 (శ్రీచక్ర): గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబర్ 16న కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సంబంధించిన కేసులో భాగంగా, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ మరియు సర్పంచుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సోమవారం కర్నూలు కోర్టుకు హాజరయ్యారు .ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఆందోళన సందర్భంగా కేంద్ర మంత్రి దేవ్ సింగ్ చౌహాన్‌ను అడ్డుకుని నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ కేసు నమోదైంది.కోర్టు విచారణ అనంతరం నాయకులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలు నిధుల కొరతతో తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి పెండింగ్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసి గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల సాధన కోసం చేపట్టిన ఉద్యమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతా యని నాయకులు స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు విడుదలయ్యే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. కోర్టుకు హాజరైన వారిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి (ఆళ్లగడ్డ), జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న (కోడుమూరు), జిల్లా కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి (దేవనకొండ), జిల్లా సహ కార్యదర్శి ఎం. షేక్ బాషా (గోనెగండ్ల)తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఆరోపణలు కాదు... ఆధారాలు చూపించండి

**మంత్రి కొలుసు పార్థసారథి**

ఏలూరు ,ఆరోపణలు కాదు... ఆధారాలు చూపించండి అంటూ రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పై ధ్వజమెత్తారు. వివరాలు ఇలా ఉన్నాయి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు నితిన్ కృష్ణ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ పై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు చేస్తున్న ఆరోపణలను మంత్రి పార్థసారథి తీవ్రంగా ఖండించారు.క్వారియింగ్ నూజివీడు నియోజకవర్గంలో ఒక్క చోటే జరగట్లేదు అన్నీ చోట్ల జరుగుతుంది అమరావతి అభివృధి చేయాలంటే లక్షల ట్రిప్పు గ్రావెల్ అవసరం అని కనీసం అవగాహన కూడా లేకుండా విమర్శలు చేయవద్దని అన్నారు.అంతే కాకుండా”వైసీపీలో సభ్యత్వం కావాలంటే రౌడీషీటర్ అయి ఉండాలా?”అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.స్వయంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావే “నేను రౌడీలకే రౌడీని” అని బహిరంగంగా చెప్పిన వ్యక్తి అని,అలాంటి వారి మాటలను ప్రజలు అస్సలు నమ్మరని స్పష్టం చేశారు.”నేను రూ.2 కోట్లతో రూ.30 కోట్లు సంపాదించానని ఆరోపిస్తున్నారు మరి మీరేమిటి? వందల ఎకరాల పట్టా భూముల్లో మైనింగ్ చేసి ఎన్ని వందల కోట్లు సంపాదించారో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా?” అంటూ ప్రతాప్ అప్పారావుకు మంత్రి సవాల్ విసిరారు.నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం వైసీపీ నాయకులకు ఏమాత్రం ఇష్టం లేదని,అందుకే కొత్త పరిశ్రమలు వస్తుంటే అసత్య ప్రచారాలు చేసి పెట్టుబడిదారులను భయపెట్టే విషపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.”మీకు నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నూజివీడులో స్థలం చూపించండి,

**జీవో 396కు వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్..!, మాట్లాడుతున్న డాక్యుమెంట్ రైటర్ దాసరి.ప్రవీణ్ కుమార్..**



కోట : జూలై 20 (శ్రీ చక్ర):కోట మండలంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద డాకుమెంట్ రైటర్లు జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలనీ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్బంగా సోమవారం కోట మండలంలోని స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయం పరిధిలో గత ఎన్నో సంవత్సరాలనుండి డాక్యుమెంట్లను సిద్ధం చేస్తున్నామని ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన 396 జీవోతో తవ జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని దస్తావేజు లేఖర్లు ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే 396 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు.అనంతరం దస్తావేజు లేఖర్లు దాసరి.ప్రణీత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 31 వ తేది వరకు పెన్ డౌన్ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కోట వెంకటేశ్వర్లు, ఆములూరు ప్రభాకర్ రావు, అద్దంకి హరి కిరణ్,బీరం గుంట విష్ణు,కృష్ణపట్నం సాయిబాబా, దాసరి ప్రణీత్ కుమార్,మారం ఏడుకొండలు,పూజిత్, సుబ్బారావు,సుధీర్,తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక లోపాలతో ఏ ఒక్క గిరిజనుడు సంక్షేమ పథకాలు కోల్పోకూడదు

**అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలి డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు**



బి.ఎన్. కండ్రిగ, జూలై 20( శ్రీచక్ర):ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సాంకేతిక లోపాలు, పత్రాల అసంపూర్ణత లేదా అవగాహన లేకపోవడం వల్ల ఏ ఒక్క గిరిజన కుటుంబానికీ దూరం కాకూడదని డీవీఎంసీ సభ్యుడు, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు అన్నారు. సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ గ్రామ సచివాలయం వద్ద వేణుగోపాలపురం, మొక్కలచేను, గాజులపెళ్లూరు యానాది కాలనీలకు చెందిన గిరిజన కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, రేషన్, గృహ పథకాలు, ఆరోగ్య సేవలు, తల్లికి వందనం లాంటి విద్యా పథకాలు, ఉపాధి అవకాశాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబర్ లింకింగ్, ఈ-కేవైసీ, బయోమెట్రిక్ సమస్యలు వంటి సాంకేతిక కారణాలతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత గ్రామ సచివాలయం లేదా అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన లేక చాలామంది గిరిజనులు తమ హక్కులను కోల్పోతున్నారని పేర్కొన్న త్యాగరాజు, ప్రతి కుటుంబం ప్రభుత్వ ప్రకటనలను గమనిస్తూ అవసరమైన ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. అన్ని మండలాలో ఎంపీడీఓ లు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజనులు, మహిళలు పాల్గొని తమ సమస్యలను గుత్తి త్యాగరాజు దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## విద్యార్థునుల భద్రతే లక్ష్యం పట్టణ ఎస్.ఐ విశ్వనాథ రెడ్డి




మార్కాపురం జూలై 20 (శ్రీ చక్ర )మార్కాపురం విద్యార్థుల భద్రతే లక్ష్యంగా పట్టణ పోలీసులు పాఠశాలల వద్ద ప్రత్యేక నిఘా చేపట్టారు. సోమవారం జెడ్పీ బాలికల పాఠశాల వద్ద ఎస్ఐ విశ్వనాథ రెడ్డి భద్రతా ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ లేదా వేధింపులకు పాల్పడే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసుల కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రారంభం, ముగింపు వేళల్లో ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు సరే...

**తీర ప్రాంత గ్రామాల్లో ఉండే దళిత బిడ్డలకు అవకాశంగా చదువుకునే పరిస్థితి లేనట్లే ఇక ..!**
**దళిత బిడ్డలకు సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం శాపంగా మారింది..,**
**దళిత బిడ్డలకు అనుకూలంగా ఉండే పాఠశాల నుండి మరొక పాఠశాలలకు తరలించడం అన్యాయం..,**
**విద్యార్థులకు,తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ముందుస్తుగా అవగాహన కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం..,**
**ఎమ్మెల్యే సార్ గారూ....దళిత బిడ్డలను రక్షించండి...,**
**సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటును ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపసంహరించుకోవాలి...,**






కోట : జూలై 20 (శ్రీ చక్ర): సుమారు 40 సంవత్సరాల నుండి ఎంతోమంది దళిత పేద విద్యార్థులకు విద్యను అందించే ఓ పవిత్రమైన దేవాలయం లాంటి డాక్టర్ బీ ఆర్ అంబెడ్కర్ గురుకుల పాఠశాలను ఎత్తేయాలని ఆలోచన ఎవరికి వచ్చిందో మరీ దీని ప్రభావంతో తీర ప్రాంత గ్రామాల్లో నివసించే దళిత విద్యార్థులకు ప్రస్తుతం శాపం లాగా మారింది.ఇన్ని సంవత్సరాల నుండి ఇదే గురుకుల పాఠశాలలో చదివిన మరెంతో మంది విద్యార్థులు పలు రకాలలో ఉన్నత శ్రేణి ల్లో స్థిరపడ్డ విషయం అందరికీ తెలిసిందే.ఇక్కడ చదువుకున్న వారు డాక్టర్లు,ఇంజనీర్లు,ఉపాధ్యాయులు,అధ్యాపకులు,రాజకీయ నాయకులు,పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు,వీటితోపాటు పలు రకాల రంగాల్లో ఉన్నారు. అస్సలు ఈ పాఠశాలల్లో చదువుకునే బిడ్డలను అర్ధాంతరంగా మరొక చోటకు వెళ్లి చదువుకోవాలని ముప్పతిప్పలు పెట్టడం ఏమిటని దళిత బిడ్డల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.దళిత బిడ్డలకు అండదండలు ఎవరూ ఉండరనే ఉద్దేశంతోనే అకస్మాత్తుగా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం జరిగుండొచ్చు.గత సంవత్సరాల నుండి ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యధిక శాతంలో విద్యార్థులు చేరి చదువుకుంటూ ప్రశాంతంగా ఉన్న సందర్భంలో ఈ పాఠశాల పైన ప్రభుత్వం దృష్టి పడడం బాధాకరంగా ఉందంటూ దళిత బిడ్డల తల్లిదండ్రులు,పలు దళిత నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక్కడే చదువుకుంటున్న పిల్లలు మరొక పాఠశాలలకు పుస్తకాలు,పెట్టేలు, బకెట్ లు తీసుకుని వెళుతుంటే ఆ బిడ్డలు,వారి తల్లిదండ్రుల బాధలను ప్రత్యక్షంగా చూస్తుంటే ఆ గురుకుల పాఠశాల వాతావరణం అంతా వర్ణనాతీతంగా మారింది సుమారు రెండు నెలలు ఎండాకాలం సెలవులు ఉండడం అందరికీ తెలిసిందే.ఇలాంటి సందర్భంలో దళిత బిడ్డలకు, వారి తల్లిదండ్రులకు,బోధించే ఉపాధ్యాయులకు ముందుగా ఇలాంటి వాటిపై అవగాహన కల్పించి ఉంటే సంతోషంగా ఉండే అవకాశం ఉండేది. అలాకాకుండా అర్ధంతరంగా ఉన్నట్టుండి ఐ ఐ టీ, నీట్, జే ఈ ఈ శిక్షణా పేరులతో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం ఇక్కడ పెడుతున్నామని చెప్పి వారిని పలు పాఠశాలలకు తరలించడం ఎంత మాత్రం సమంజసమని పలువురు ఆరోపిస్తున్నారు.గత ఎన్నో సంవత్సరాల నుండి ఇదే పాఠశాలల్లోని విద్యార్థులు ఓ ప్రక్క చదువులో నైపుణ్యత కలిగి మరో ప్రక్క క్రమశిక్షణగా ఉంటూ మరో ప్రక్క క్రీడా రంగాల్లో బహుమతులను సాధించే విధానంలో మొదటి స్థాయిలో ఉండడం ఈ గురుకుల పాఠశాలకు ప్రత్యేకత ఉందని చెప్పడంలో సందేహం లేదు.కోట, వాకాడు,చిట్టమూరు,చిల్లకూరు, చెన్నూరు,నాయుడుపేట, నెల్లూరు,కావలి,తదితర లాంటి ప్రాంతాల నుండి ఈ గురుకుల పాఠశాలలో చేరి విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులు మరెంతో మంది ఉన్నారు. అంతేకాకుండా కోట,వాకాడు, చిట్టమూరు ప్రాంతాల్లో ఉండే దళిత బిడ్డల అందరికీ ఈ పాఠశాల అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చేరేవారు.ఈ పరిసర ప్రాంతాల్లోనే అనుకూలంగా ఉండే బిల్డింగులు ఉన్న విషయం వాస్తవం కాదా.. రాష్ట్రవ్యాప్తంగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రాలను వైజాగ్, గుంటూరు,కోట ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. విద్యార్థులు ఐఐటి,నీట్,జేఈఈ శిక్షణ కేంద్రంగా కోట మండలంలోని ఎస్సీ గురుకుల పాఠశాలను ఎంపిక చేసినట్లు తెలిసింది.ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను మార్చడం జరిగింది. అంతేకాకుండా సబ్ రిజిస్టర్ కార్యాలయం,అంగన్వాడి ఐసిడిఎస్,సిఐ సర్కిల్ ఆఫీస్, అంతేకాకుండా కోర్టు,ఇకపోతే ఆర్టీసీ బస్టాండ్,ఫైర్ కార్యాలయం,ఇలాంటి మరెన్నో త్వరలోనే గూడూరు కేంద్రంగా తరలించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.తద్వారా కోట మండల ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కూడా నెలకొనవచ్చును.ప్రస్తుతం ఇలాంటివన్నీ జరగకుండా ఉండాలంటే మన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్పందించి చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా రెవెన్యూ శాఖ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి సారథ్యంలో కోట ప్రాంతంలో మరెన్నో కార్యాలయాలను, గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగింది.నేడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదుకునే దళిత బిడ్డలకు ఇలా అన్యాయం జరిగింది... రాను రాను ఇంకెన్ని జరగబోతాయో అని ప్రజల్లో సందేహం ఏర్పడుతుంది. ఏదేమైనా ప్రస్తుతం ప్రజలు ఏమీ చేయలేని నిరుత్సాహ పరిస్థితుల్లో ఉన్నారు. ఉదాహరణకు ఎస్సీ గురుకుల పాఠశాలను అకస్మాత్తుగా నిర్ణయాలు తీసుకుని అభ్యంతరంగా చదువుకునే పిల్లలను ఇతర ప్రాంతాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించలేని ధీన స్థితిలో దళిత సంఘాలు ఉంటున్నాయి.మరి కొంతమంది దళిత సంఘాలు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నారు.మరోపక్క కూడా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సీఎం చంద్రబాబు,నారా లోకేష్ బాబులతో మాట్లాడి దళిత బిడ్డలకు అన్యాయం జరగకుండా చూడాలని దళిత విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు.కోట మండలంలో సక్రమంగా నడుస్తున్న ఎస్సీ గురుకుల పాఠశాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేయడం ఏమిటని ప్రిన్సిపల్ సెక్రటరీపై దళిత బిడ్డల యొక్క తల్లిదండ్రులు,దళిత సంఘాలు, స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించి సెంటర్ ఫర్ ఎక్సెన్స్ కేంద్రాన్ని మరొకచోట ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ -2026 అవార్డుల ప్రధానోత్సవం






మార్కాపురం జూలై 20 (శ్రీ చక్ర )మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలురు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ -2026 అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా మరింత ఉత్సాహం, పట్టుదల పెరిగి విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని దీనివల్ల ఉత్తీర్ణత శాతం పెరగడంతోపాటు దాదాపు లక్ష మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఒక శక్తి కేంద్రమని ధైర్యం తో లక్ష్యం వైపు అడుగులు వేయాలని వారికి సూచించారు. విద్యార్థులు నైపుణ్యాలను నేర్చుకొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మరో ముఖ్య అతిథి కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిమాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇంత ప్రోత్సాహం గతంలో.ఏ.ప్రభుత్వంఇవ్వలేదన్నారు. విద్య ద్వారానే కుటుంబ ఆర్థిక.పరిస్థితులు.బాగుపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువు పై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. అనంతరం జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన 134 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి అవార్డు, రూ. 20వేల నగదు చెక్కును తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జెడి లింగేశ్వర రెడ్డి, ఇంటర్మీడియట్ బోర్డు డి ఐ ఈ ఓ స్వరూప రాణి, డీఈవో సుబ్బారావు, డీసీఈబీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట (జీలగ) విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు

**పిల్లిపెసర ఉంది.. సర్దుకోమంటున్న వ్యవసాయ అధికారులు"జీలగ విత్తనాలు త్వరగా అందించండి" అని రైతుల విజ్ఞప్తిబుచ్చినాయుడు**

కండ్రిగ, జూలై 20 (శ్రీచక్ర):ఖరీఫ్ సాగు సీజన్ ఊపందుకున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పంటకు ఉపయోగించే జీలగ విత్తనాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సాగుకు అనువైన సమయం దగ్గరపడుతున్నా ఇప్పటికీ విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుతం పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటినే ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. అయితే, తమ భూముల స్వభావం, సాగు విధానానికి అనుగుణంగా జీలగ విత్తనాలే అనుకూలమని రైతులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలతో ఆశించిన ప్రయోజనం ఉండదని వారు



అభిప్రాయపడుతున్నారు. పచ్చిరొట్ట పంటను సాగు చేయడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరగడంతో పాటు భూసారం మెరుగుపడి, తదుపరి పంటలకు అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున రైతులు జీలగ విత్తనాలను వినియోగిస్తున్నారు. ఈ ఏడాది మాత్రం విత్తనాల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సరైన సమయంలో విత్తనాలు అందకపోతే పచ్చిరొట్ట సాగు ఆలస్యమై, భూసారం పెంపుదల లక్ష్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జీలగ విత్తనాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని, మండల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సాగు కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలస్యం చేయకుండా సరఫరా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎస్సీ విద్యార్థులకు అండగా కూటమి ప్రభుత్వం



తాడేపల్లిగూడెం, (పెంటపాడు,) జూలై 20: శ్రీ చక్ర ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పలువురు కూటమి నేతలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పరిమళ, పెంటపాడు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థిని విద్యార్థులకు నిత్యావసరమైన వివిధ వస్తువులతో కూడిన కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. పెంటపాడు మండలం జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి,పెంటపాడు మండల ప్రజా పరిషత్తు అధ్యక్షురాలు కట్టు బోయిన వెంకటలక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల జనసేన వీర మహిళ కన్వీనర్,ద్వారకాతిరుమల పాలకమండలి సభ్యురాలు కసిరెడ్డి మధులత తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమం కోసం, వారి ఉన్నత విద్యకు అవసరమైన వసతులను కూటమి ప్రభుత్వం కల్పించిందని అన్నారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు. విద్యార్థులభవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆశయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

### జీవో 396 ను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

మార్కాపురం. జూలై 20 (శ్రీ చక్ర )మార్కాపురం.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ దస్తావేజు లేఖర్లు సుబ్బారావు, మస్తాన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతోపాటు కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానమును రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 396 ను రాష్ట్రంలోని దస్తావేజు లేఖర్లు అందరూ వ్యతిరేకిస్తున్నారని కావున దీనిని వెంటనే రద్దు చేయాలని కోరారు. అంతేకాకుండా ఎంతోమంది నిరుద్యోగులు సంవత్సరాల తరబడి లేఖర్ల వృత్తిలో కొనసాగుతూ లక్షల మంది జీవనం సాగిస్తున్నారని జీవో నెంబర్ 396 ను అమలుపరిస్తే అందరూ రోడ్డున పడాల్సిన దుస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఈ జీవ ప్రకారం రిజిస్ట్రేషన్లు జరిగితే కక్షిదారులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కార్పొరేట్ రిజిస్ట్రేషన్స్ మాకొద్దు - కాగితాల రిజిస్ట్రేషన్ మాకు ముద్దు అంటూ నినాదాలు చేశారు. దస్తావేజు లేఖర్లు అందరికీ లైసెన్సులు ఇచ్చి ఇదే వృత్తిలో కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ పీరా, కార్యదర్శి పిన్నిగా శివ తదితర మార్కాపురం లోని దస్తాయ విలేకరులందరూ పాల్గొని పెన్ డౌన్ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

శ్రీచక్ర

మంగళవారం 21-07-2026

# పిజిఆర్ఎస్ అర్జీలు స్వీకరించిన తహసీల్దార్ లక్ష్మీనారాయణ

**సరైన పరిష్కారం చూపాలంటూ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు**



బి.ఎన్. కండ్రిగ, జూలై 20 (శ్రీచక్ర):ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కేవలం అర్జీ స్వీకరించడమే కాకుండా, అర్జీదారుడు తృప్తి చెందే విధంగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లే లక్ష్యంతో పీజీఆర్ఎస్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎం ఈ ఓ,పశువైద్య అధికారి,ఐ ఏ ఈ,వివిధ శాఖల అధికారులు పాల్గొని, అందిన అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ సమస్యలను నిర్భయంగా పిజిఆర్ఎస్ ద్వారా తెలియజేసి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# నెల్లూరుపల్లి దళితవాడలో డ్రైనేజ్ కాలువ నిర్మాణానికి భూమిపూజ.. పనులకు శ్రీకారం చుట్టిన నెల్లూరు మోహన్ రెడ్డి..,



కోట : జూలై 20 (శ్రీ చక్ర):కోట మండలం నెల్లూరుపల్లి దళితవాడలో టీడీపీ నేత నెల్లూరు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రైనేజ్ కాలువ నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి హరిప్రసాద్ రెడ్డి, వేణుంబాక అశ్విన్ రెడ్డి,ముంగర మురళి రెడ్డి,నేదురుమల్లి కిరణ్ కుమార్ రెడ్డి,ఎంపిటిసి యానాటి నారాయణ,పెనుబోలు సాయికుమార్ రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి అడిగిన వెంటనే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. దళితవాడలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సహకారంతో ఎన్నాళ్లుగానో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం అధ్యక్షుడిగా చల్లా సురేష్ గౌడ్ ఎంపిక..., కోటలో ఘనంగా జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనం..,

కోట : జూలై 20 (శ్రీ చక్ర):కోట మండలం కోట పట్టణంలోని ఏఎన్ఆర్ కళ్యాణమండపంలో ఆదివారం మండల స్థాయి గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తిరకాల శీనయ్య గౌడ్ విచ్చేశారు. ఈ సందర్భంగా మారుబోయిన మధు గౌడ్ ఆధ్వర్యంలో కోట మండలం గోవిందపల్లి గ్రామానికి చెందిన చల్లా సురేష్ గౌడ్ ను కోట మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చల్లా సురేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన జిల్లా పెద్దలతో పాటు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండలంలోని గౌడ కులబాంధవుల ఐక్యతకు, సంక్షేమ,అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అందరినీ కలుపుకొని పోతూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులతో పాటు చల్లా సురేష్ గౌడ్ కు మిత్రులు, శ్రేయోభిలాషులు,పలువురు గౌడ కులస్తుల ప్రతినిధులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# కూటమి ప్రభుత్వంలోనే అంగన్‌వాడీలకు న్యాయం..,



**కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం..,**

**వారికి వేతనాలు పెంచింది టీడీపీ ప్రభుత్వమే..,**

**వైసీపీ పాలనలో అన్ని రకాలుగా నష్టపోయారు..,**

కోట : జూలై 20 (శ్రీ చక్ర): మహిళా శిశు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నదని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్ నందు కోట,వాకాడు,చిట్టమూరు మండలాల పరిధిలో ఉన్న 504 అంగన్వాడీ కేంద్రాలకు ఎమ్మెల్యే సునీల్ కుమార్,ఎంపిపి ఎంబేటీ శశి,పలువురు టీడీపీ నాయకులు చేతులుమీదుగా ఇండక్షన్ స్టవ్ లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా ఈ స్టవ్ లను ప్రభుత్వం నుండి అందిస్తున్నారని, నెలకు 500 రూపాయలు కరెంట్ బిల్లు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వం అధికారం లోని వచ్చిన తర్వాత 42 అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. కావున అంగన్వాడీలందరూ పనిచేసే ప్రభుత్వాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం పి ఎమ్ ఏజేఏవైపథకం క్రిందజీవనోపాధి కొరకునమోదు చేసుకున్న ముగ్గురకి ఒక్కొక్కరకి 3 లక్షల చొప్పున ఆటోలను అందించారు. అంతేకాకుండా పలువురికి చెక్కులును అందించారు. శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనిలో ఉన్న స్కూల్ మెర్జింగ్ చేస్తూ ఇక్కడ నుండి ఏ ఎస్ పురం ఉన్న స్కూల్ కు వెళ్లాలంటే దూరంగా ఉందని,ఆ పాఠశాల ఇక్కడే ఉంచాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగ ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తామని పిల్లలు తల్లిదండ్రులుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు దశరథ రామిరెడ్డి,ఎంపిపి ఎంబేటీ. శశి,నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి,తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్ అహ్మద్, మద్దాలి సర్వోత్తం రెడ్డి,నెల్లూరు మోహన్ రెడ్డి,కోకర్ల మధుయాదవ్,ఏఎంసిచైర్మన్ధారాప్రమీల,పల్లెమల్ల వెంకట కృష్ణారెడ్డి,ఎంపిడిఓ దిలీప్ కుమార్,అంగన్వాడిసిడిపిఓముని కుమారి,ఇంగిలాలరామయ్య,టీడీపీ నాయకులు,అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఒక రోజు చేపలు పట్టుకునేందుకు జిల్లా పరిషత్తుకు రికార్డు స్థాయిలో పెరిగిన ఆదాయం

**అధికారులు ఆశ్చర్యపరిచిన బహిరంగ వేలం**

**పాట 7 లక్షల 11 వేలు,జీఎస్టీ తో 8 లక్షల 40, వేలు**

**ప్రభుత్వానికి నాలుగు రెట్లు పెరిగిన ఆదాయం**

**కంగుతున్న ఆశావాహులు ఆశావాహులు అంచనాలు తల్లకిందులు**

**హెచ్చు పాట ద్వారా జన సైనికుడు జగదీష్ కైవసం**

**అజ్ఞాత వ్యక్తి ప్రోద్భలంతో పెరిగిన ఆదాయం**



కాజులూరు, జూలై 20( శ్రీచక్ర)గొల్లపాలెం గ్రామంలో గల సిపిడబ్ల్యూఎస్ సమ్మర్ స్టోరేజీ చెరువు నందు సహజ సిద్ధంగా పెరిగిన మత్స్య సంపదను పట్టు కొనేందుకు ఎట్టకేలకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించడంతో రికార్డ్ స్థాయిలో ఆదాయం పెరగడంతో పాట నిర్వహించిన అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది . దీంతో గత పదవతేదిన జరగాల్సిన ఈ బహిరంగ వేలం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో వాయిదా వేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో జే. రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ వేలంలో 16 మంది నిబంధనల మేరకు డిపాజిట్లు కట్టి వేలంపాటలో పాల్గొన్నారు. వాస్తవానికి 11 గంటలకు మొదలు పెట్టాల్సిన బహిరంగ వేలం 12 గంటలకు తర్వాత ఎట్టకేలకు ప్రారంభమైయ్యింది. దీంతో జిల్లాపరిషత్ రెవెన్యూ అధికారి కనికెళ్ల శ్రీనివాస సమక్షంలో ప్రారంభమైన బహిరంగ వేలానికి మంచి స్పందన లభించి ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో ఆదాయం చేకూరింది. తొలుత 90 వేల రూపాయలతో ప్రారంభమైన పాట లక్షా తొమ్మిది వేల రూపాయలకు ఆర్యావటం గ్రామానికి చెందిన వీరవల్లి గణపతి నుండి మొదలుకొని పలువురు దఫా దఫాలుగా పాటను పెంచుకుంటూ పోగా ఇదే వీరవల్లి గణపతి 7 లక్షల 9వేలరూపాయల వరకూ వెళ్ళడంతో పాటలో పాల్గొన్న వారికే వంకింత ఆశ్చర్యాన్ని గురిచేసింది అలాగే అధికారులు సైతం నిశ్చేయులను చేసింది. అయితే అక్కడతో పాట ఆగకుండా మండల కేంద్రమైన కాజులూరు గ్రామానికి చెందిన జనసేన సైనికుడు సాదా జగదీష్ మరో రెండు వేల రూపాయలు పెంచడంతో 7 లక్షల 11 వేల రూపాయలు హెచ్చు పాట దారుడైన జన సైనికుడు జగదీష్ కైవసం చేసుకున్నారు. దీంతో హెచ్చుపాట దారుడైన జగదీష్ కి అధికారులు ఈబహిరంగ వేలం ద్వారా గొల్లపాలెంలో గల సిపిడబ్ల్యూఎస్ స్కీముకి సంబంధించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నందు ఒకరోజు సహసిద్ధంగా పెరిగిన చేపలను పట్టుకుని అమ్ముకునేందుకు అనుమతు లభించింది. ఆశావాహుల అంచనాలు తల్లకిందులు, నాలుగు రెట్లు పెరిగిన ఆదాయం. దీంతో గత పది రోజుల నుండి ఎలాగైనా ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో చేపలను పట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేసిన ఆశావాహులు అంచనాలు తలకిందులయ్యాయి. ముఖ్యంగా ఎవరు ఊహించని విధంగా రికార్డ్ స్థాయిలో జిఎస్టితో కలిపి 8, లక్షల 39 వేల రూపాయలకు వెళ్లడంతో గతంలో మునుపేన్నడు లేని విధంగా ఈ బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వాని ఆదాయం పెరగడం అధికారుల సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. కాగా సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సిపిడబ్ల్యూఎస్ స్కీముకి సంబంధించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సాహసిద్ధంగా పెరిగిన చేపలు పట్టుకునేందుకు మునుపెన్నడు లక్షా 85 వేల రూపాయలకు మించని ఆదాయం ఒక్కసారిగా నాలుగు రెట్లు పెరగడంతో అధికారుల సైతం ఆశ్చర్యాన్ని గురి చేయడంతోపాటు విషయం తెలిసిన మండల ప్రజల సైతం ఒకరోజు పాటకే ఇంత హెచ్చు పాటా అంటూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే ఇక్కడ ఈ స్టోరేజీ ట్యాంకులో కేవలం సహజ సిద్ధంగానే కాకుండా సంబంధిత స్టోరేజీ ట్యాంకు మెయింటినెన్స్ కాంట్రాక్టర్ ట్యాంకులో నాచు, గడ్డి తినేందుకు చెరువు అప్పట్లో కొన్ని చేపలను వేయడం,ఇదే అదునుగా అజ్ఞాత వ్యక్తులు రాత్రి వేళల్లో చేపలను వేసిన సందర్భాలను దృష్టిలో పెట్టుకుని హెచ్చు పాటకు జగదీష్ పాడినట్లు సమాచారం. అజ్ఞాత వ్యక్తి ప్రోద్భలం తోనే హెచ్చు పాట. మండలానికి చెందిన ఒక అజ్ఞాత వ్యక్తీ ప్రోద్బలంతో ఇచ్చిన భరోసాతోనే ఒక్కసారిగా మునిపెన్నడూ లేని విధంగా నాలుగు రెట్లు పెంచి మరి హెచ్చు పాట ద్వారా కాజులూరు చెందిన జన సైనికుడు జగదీష్ కైవసం చేసుకుని జనసేన ఖాతాలో వేసారని సమాచారం. కాగా ఏది ఏమైనా ఇక్కడ అనధికారకంగా అజ్ఞాత వ్యక్తులు రాత్రి వేళల్లో వేసిన చేపలు తమకు దక్కకుండా పోతున్నాయన్న ఆలోచన అయితే మాత్రం సోమవా రం జరిగిన బహిరంగ వేలంలో స్పష్టంగా కనిపించింది. అర్యావటం ,గొల్లపాలెం, గ్రామాలకి చెందిన వ్యక్తులు ఎక్కువ మంది వ్యక్తులు ఈ బహిరంగ వేలంలో పాల్గొన్నప్పటికీ కాజులూరు గ్రామానికి చెందిన ఒకే ఒక వ్యక్తి జగదీష్ పాల్గొని హెచ్చు పాటతో బహిరంగ వేలం ద్వారా కైవసం చేసుకున్నారు. ఈవిషయంలో ఇప్పటివరకు పైరవీలు చేసిన వ్యక్తులు సైతం కంగుతిన్నారు. ఈ బహిరంగ వేలంలో జిల్లా పరిషత్ ఆర్వో కనికెళ్ళ శ్రీనివాసు, ఎంపీడీవో జె. రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనారాయణ మూర్తి (చంటి), ఏ వో పద్మలత,గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సూర్య ప్రకాష్, వీరవల్లి గణపతి, కోటిపల్లి నాగేశ్వరరావు ,మాతా నాగరాజు, బి నాగమల్లేశ్వరరావు, పలివెల సూరిబాబు, అంగర శ్రీనివాసరావు, తాడి మాచారెడ్డి, జి. వెంకటేశ్వరరావు, కట్టా శ్రీను, శేరు అప్పారావు, ధర్మాడి చినబాబు, ధర్మాడి కామరాజు, గంధం రాంబాబు, కోట పద్మావతి, ధర్మాడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎంపిపి ఎంబేటీ.శశి



కోట :జూలై 20 (శ్రీ చక్ర): కోట మండలంలో ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్ నందు అంగన్వాడీలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్,ఎమ్ పి పి ఎంబేటీ శశి చేతులుమీదుగా చెక్కులను అందజేశారు. అనంతరం కూటమి ప్రభుత్వలో ప్రజలకు ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు.

# హాస్టల్ విద్యార్థినులకు సామగ్రి పంపిణి



కోట : జూలై 20( శ్రీ చక్ర):కోట పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం నందు ఆదివారం తెలుగుదేశం పార్టీ కోట మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన బెడ్ షీట్లు, దుప్పట్లు, టవళ్లు, నైట్ డ్రెస్లు, ప్లేట్లు, గ్లాసుల సామగ్రిని 175 మంది విద్యార్థినులకు పలగాటి భాస్కర్ రెడ్డితో పాటు కోట మాజీ ఎంపీపీ, టిడిపి నాయకులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వసతి గృహ విద్యార్థినుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్ధపరెడ్డి పోలమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డి,కోకర్ల మధు యాదవ్ లు చేతులుమీదుగా గవర్నమెంట్ విద్యార్థులకు విద్యా సామాగ్రి ని అందజేశారు. అనంతరం షేక్. జలీల్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసంగా నారా లోకేష్ బాబు విద్యాశాఖ మంత్రిగా కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా తల్లికి వందనం,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు పౌష్టికాహారంను అందించేవిధంగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కష్టపడి చదువుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చుకోవాలని పలు సూచనలు అందజేశారు. అదేవిధంగా 10వ తరగతిలో 80 శాతం ఉత్తీర్ణత చెందినవారికి ఐ ఐ టీ,నీట్, తదితర వాటికీ శిక్షణ ఇవ్వడాని కి ఇక్కడే ఆయా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆయా శిక్షణ కేంద్రం వైజాగ్, గుంటూరు, గూడూరులో నియమించి ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. అంతేకాకుండా హాస్టల్ వార్డెన్ ఉషారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 15 లక్షల రూపాయలతో ఎస్సీ హాస్టల్ వసతి గృహాన్ని మరమ్మతులు చేపట్టామని తెలిపారు.

# మృతుని కుటుంబానికి బిజెపి శ్రేణులు పరామర్శ



రామచంద్రపురం, జూలై 20( శ్రీచక్ర)రామచంద్రపురం మండలం తోటపేట గ్రామానికి చెందిన ప్రముఖ భజన కళాకారులు ప్రసన్నాంజనేయ బాల భక్త సమాజం,ద్రాక్షారామ నాటక కళా పరిషత్ సభ్యులు వాసంశెట్టి నారాయణ మూర్తి ఇటీవల మృతి చెందిన సందర్భంగా ద్రాక్షారామం నాటక కళా పరిషత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు నాగిరెడ్డి సతీష్ రావు,కర్రి చిట్టిబాబు తోటపేట లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ద్రాక్షారామనాటక కళా పరిషత్ కు ఆయన చేసిన సేవలను స్మరిస్తూ వారి ఆత్మకు శాంతిచేకూరాలనిసతీష్ కొరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

జీలుగుమిల్లి( శ్రీ చక్ర )జూలై 20ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన మండలం లోని ఐదు పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నట్లు ఎమ్ఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. వారిలో జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు డి.హఫీజ,కె.వైష్ణవి,ములగలంపల్లి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ఎం.అనిల్,అంకన్నగూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు ఇద్దరు పి.అనిత,సి హెచ్ దేవి శ్రీ దర్భగూడెం సెయింట్ పీటర్ అండ్ పాల్ పాఠశాలకు చెందిన ఆర్ ప్రణవి, వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రానికి చెందిన జె.వైష్ణవి లు మొత్తం ఏడుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు దక్కాయని ఎమ్ఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కు చెందిన జి.పూజ షైనింగ్ స్టార్ అవార్డ్ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ బి.సతీష్ కుమార్ తెలిపారు. వీరికి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా రూ.20 వేల నగదు, పథకం సర్టిఫికెట్, ప్రశంస పత్రం అందించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి లో అవార్డులు అందుకోవడం తో ఎమ్ ఇ ఒ లు శ్రీనివాస్, బుచ్చయ్యలు,ప్రధానోపాధ్యాయులు యు టి ఎఫ్ కార్యవర్గం,తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు..



# లేజర్ రన్ స్టేట్ ఛాంపియన్షిప్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన ప్రితిక్ శ్రీ .



రామచంద్రపురం, జూలై 20( శ్రీచక్ర) పదవ స్టేట్ లేజర్ రన్ ఛాంపియన్షిప్ పోటీలు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఘనంగా ముగిసాయి .ఈ పోటీలను ఏలూరు శాసనసభ్యులు బి .రాధాకృష్ణ (చంటి ) సాప్ డైరెక్టర్ కె జగదీశ్వరి , మోడరన్ పెంటా తలాన్ స్టేట్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు ఈ పోటీలలో కాకినాడకు చెందిన ప్రగతి స్కూల్ విద్యార్థి వి ప్రితిక్ శ్రీ టీం ఈవెంట్లో ఎన్టీఆర్ జిల్లా తరపున సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది . అలాగే ఇండివిద్యువల్ ఈవెంట్లో సిక్స్త్ ప్లేస్ తో ఆగి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పొందడం జరిగింది ఈ సందర్భంగా మోడరన్ పెంటతలాన్ స్టేట్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు క్రీడల్లో ఆసక్తి చూపాలని మానసిక శారీర వికాసం పెరుగుతుందని అలాగే భవిష్యత్తులో వచ్చే అవకాశాలు కూడా ఇవి ఉపయోగపడతాయని పిల్లల్ని చదువుతోపాటు క్రీడలను కూడా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలియజేశారు అలాగే కాకినాడ జిల్లాకు ఇంకా అనేక అవార్డులు వచ్చాయని అలాగే ఎక్కువగా కోనసీమ జిల్లాకు కూడా అవార్డులు తగ్గించుకున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు ఈవెంట్ ఆర్గనైజర్ ప్రసాద్ బి ఎన్ వి ఎస్ ప్రసాద్ ఏలూరు మోడరన్ పెంటా తలాన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రాష్ట్ర కార్యదర్శి మౌనిక కృష్ణయ్య సాంబ మనోహర్ రెడ్డి వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

# క్రీడలపై చిన్నారులు ఆసక్తి పెంచుకోవాలి : డాక్టర్ చప్పిడి





రామచంద్రపురం, జూలై 20 (శ్రీచక్ర) క్రీడలపై పిల్లలు ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలతో పాటు చదువు కూడా బాగా చదువుకోవాలని అలా చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా మంచి ఎదుగుదల ఉంటుందని హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చ ప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు కరప మండలం కరప గ్రామంలో స్కూలు కాలేజీ విద్యార్థులు సాయంకాల సమయం ఆటలపై ఆసక్తి కనపరిచి ముందుకు వెళుతుండగా వారికి వాలీబాల్ మరియు దానికి సంబంధించిన నెట్ వంటి సామాన్లు వారికి బహుమతిగా ఇవ్వటం జరిగింది అలాగే వీరందరికీ తగిన ప్రోత్సాహము ఇచ్చి క్రీడలలో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని సాయంకాలం మీరు ఆడుకునేలా లైట్లు ఏర్పాటు చేస్తామని కరెంటు విషయం పంచాయతీతో మాట్లాడతామని ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి తెలియజేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి తాతీలు తెలుగుదేశం జిల్లా కార్యనిర్వ కార్యదర్శి దేవు వెంకన్న అలయన్స్ క్లబ్స్ ఇంటర్ నేషనల్ కమిటీ చైర్మన్ వనుము శ్రీనివాసరావు కోన వెంకట్ లక్ష్మి డాక్టర్ పూర్ణ సురేష్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు


# కాజులూరు విద్యార్థిని తనిషాకి "షైనింగ్ స్టార్" అవార్డు.కలెక్టర్ చేతుల మీదుగా ప్రధానం




కాజులూరు ,జూలై 20 (శ్రీచక్ర)కాజులూరు జూనియర్ కాలేజీకి చెందిన షేక్ తనీషాకి "షైనింగ్ స్టార్" అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం కాకినాడటి.టి.డి. కల్యాణ మండపంలో జరిగిన "షైనింగ్ స్టార్" అవార్డు ఫంక్షన్ లో అవార్డు గ్రహీత షేక్ తనీషా హెచ్ ఈ సి గ్రూపులో 1000 మార్కులకు 897 మార్కులు తెచ్చుకున్న తనీషా కాకినాడ జిల్లా కలెక్టర్ కలెక్టరు హరిచంద్రప్రసాద్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు సభకు హాజరైన పలువురు ప్రముఖుల సమక్షంలో అందుకుంది. దీంతో ఆవిద్యార్థినికి 20 వేలం రూపాయలు నగదు బహుమతి, ప్రశంసాపత్రంతో మెడల్ అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థిని తనిషాని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శ్రీనివాస్ , కళాశాల సిబ్బంది, విద్యార్థిని , విద్యార్థులు, గ్రామపెద్దలు తదితరులు అభినందించారు.

# రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కర్రావుకి ఘనసత్కారం

**రావులపాలెం మేనేజర్ కుమార్ ఇన్చార్జిగా బాధ్యతలు.డిపో సిబ్బంది ఘనంగా వీడ్కోలు**



రామచంద్రపురం , జూలై 20 (శ్రీచక్ర)సుదీర్ఘ కాలం పాటురామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ గా సేవలందించిన పేవకాయల భాస్కరావు పదోన్నతిపై నెల్లూరు జోనల్ వర్క్స్ మేనేజర్ వెళ్తున్న సందర్భంగా రామచంద్రపురం ఆర్టీసీ గ్యారేజ్ నందు ఆయనని ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమానికి రావులపాలెం డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్ హాజరై ఇన్చార్జిగా రామచంద్రపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో బాధ్యతలను స్వీకరించారు .ఈ సందర్భంగా భాస్కరావు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం డిపో పరిసరాల పరిశుభ్రత మొదటి స్థానం పొందిందని అదే విధంగా ఆయిల్ పొదుపులో కూడా మంచి స్థానంలో ఉందని సర్వీసెస్ లో కూడా కార్మిక సోదరులందరూ కూడా సంతృప్తికరంగా చేస్తున్నారని తెలియజేశారు . అదేవిధంగా డిపోలో ఆయనకు ఉన్న అనుబంధాన్ని సందర్భంగా తెలియజేశారు .ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు సిబ్బంది ఆఫీస్ సిబ్బంది రన్నింగ్ స్టాప్ తదితరులు ఆయన గురించి తాను చేస్తూ ఇతరులతో పని చేయించేవారని చూసి యజమాని కాదు చేసే యజమానిగా డిపో ఎంతో చక్కగా అన్ని విభాగాల్లోనూ సంతృప్తికరంగా చేశారని కొని ఆడారు.రామచంద్రపురం డిపో అన్ని విభాగాల ఉద్యోగస్తులు సాదరంగా భాస్కరరావుకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిపో ఉన్నత స్థితికి మేనేజర్ భాస్కర రావు ముఖ్య పాత్ర పోషించారని ఈసందర్భంగా కొనియాడారు.

# సిదిరిని భయపెడుతున్న కేసులు

శ్రీకాకుళం, జూలై 20, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నాయకుల చుట్టూ వరుసగా వివాదాలు నెలకొంటుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జిల్లాలో పలువురు ప్రముఖ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన నేపథ్యంలో, ఇప్పుడు మాజీ మంత్రి సీదరి అప్పలరాజు పేరు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై నమోదైన కేసు, అరెస్టు జరిగే అవకాశాలపై జరుగుతున్న ప్రచారం జిల్లాలో రాజకీయ చర్చలకు దారితీస్తోంది.గతంలో పార్టీ తరపున దూకుడుగా స్పందిస్తూ అధికార పక్షంపై విమర్శలు చేసిన నాయకుల్లో సీదరి అప్పలరాజు ఒకరు. జిల్లాలో పార్టీ తరఫున బలమైన స్వరం వినిపించే నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం వ్యవహారం ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఆయన కుమారుడు ఆరవ్ వర్మ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, వేగంగా బైక్ నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అనంతరం ఆరవ్ వర్మను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో మాజీ మంత్రి పాత్రపై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందనే అనుమానాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రిపై కూడా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ న్యాయ సంహిత లోని 61(2), 238, 240, 242, 249, 49 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు ఆధారంగా తదుపరి చర్యలు ఏముంటాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.మాజీ మంత్రి అరెస్టు జరిగే అవకాశముందంటూ పలాస ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పోలీసులు అధికారికంగా అలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు సీదరి అప్పలరాజు కూడా ఈ ఘటనపై బహిరంగంగా స్పందించలేదు. ఆయన మౌనం కూడా ఈ వ్యవహారంపై మరిన్ని చర్చలకు కారణమవుతోంది.సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆయన న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేసు పురోగతిని దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయపరమైన చర్యలపై చర్చిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో పోలీసు అధికారులు కూడా ఈ కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన పరిస్థితుల్లో, ఇప్పుడు మాజీ మంత్రి చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# స్వర్ణగ్రామాలుగా మార్పు

ఒంగోలు, జూలై 20, ఆంధ్రప్రదే శ్‌లో గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు ఇప్పుడు కొత్త గుర్తింపు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కార్యాలయాల పేర్లను మార్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మార్పు ప్రజల్లో స్పష్టంగా కనిపించేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ఇకపై "సచివాలయం" అనే పేరుకు బదులుగా "స్వర్ణ గ్రామం" "స్వర్ణ వార్డు" పేర్లు అధికారికంగా మరింత ప్రాధాన్యం పొందనున్నాయి.గ్రామ, వార్డు సచివాలయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2న ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వ్యవస్థ ద్వారా పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం పేర్లలో మార్పు తీసుకొచ్చింది. అధికారిక రికార్డుల్లో కొత్త పేర్లు అమల్లోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో మాత్రం ఇప్పటికీ చాలా మంది వాటిని సచివాలయాలుగానే పిలుస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కొత్త చర్యలకు శ్రీకారం చుట్టింది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15 వేలకుపైగా కార్యాలయాల వద్ద ఒకే నమూనాలో కొత్త నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డుల రూపకల్పన, పరిమాణం, నాణ్యత విషయంలో కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరు మిల్లీమీటర్ల అక్రిలిక్ షీట్‌తో పాటు ౩8 అడుగుల ఏసీపీ ( బోర్డులను తయారు చేయాలని నిర్ణయించింది. ఈ బోర్డుల తయారీ, సరఫరా బాధ్యతలను గుంటూరు జిల్లా తాడేపల్లి లోని నెక్స్టోరా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించింది .బోర్డుల తయారీ పూర్తయ్యే కొద్దీ వాటిని వేగంగా సంబంధిత కార్యాలయాలకు చేరవేసి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించింది. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు (, సంబంధిత శాఖల అధికారులు బోర్డులను స్వీకరించి ప్రతి కార్యాలయం వద్ద సక్రమంగా అమర్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డులు ఎలాంటి నష్టం లేకుండా అందాయని నిర్ధారించిన తర్వాత అధికారుల సంతకం, కార్యాలయ ముద్రతో వాటిని నమోదు చేయాలని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా బోర్డుల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, జిల్లా కోఆర్డినేటర్లు మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.రాజకీయంగా కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. గతంలో సచివాలయ భవనాల రంగులు ఒక రాజకీయ పార్టీని గుర్తు చేసేలా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీలను ప్రతిబింబించే రంగులు ఉండకూడదనే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పుడు కొత్త పేర్లతో పెద్ద నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల్లో కొత్త గుర్తింపును బలపరచాలని భావిస్తోంది. మరోవైపు, ఈ వ్యవస్థను ప్రారంభించింది తమ ప్రభుత్వమే కాబట్టి పేర్లు మారినా ప్రజలు దాని ఆరంభాన్ని గుర్తుంచుకుంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ అంశం పరిపాలనతో పాటు రాజకీయ చర్చలకు కూడా కేంద్రబిందువుగా మారింది.

# దోబూచులాడుతున్న వరుణుడు

విజయవాడ, జూలై 20, వరుణుడు దోబూచులాడుతున్నాడు. అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నా కూడా సాధారణం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైంది. ఏపీలో జూలై నెలలో 35 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఐదు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాలలో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరోవైపు ఎల్ నినో కారణంగా దేశంలోని అనేక ప్రాంతాలలో తక్కువ వర్షపాతం నమోదౌతుందని ఐఎండీ అధికారులు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుణుడు దోబూచులాడుతున్నాడు. దీంతో ఏపీలో లోటు వర్షపాతం 35 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాలలో దాదాపు 20 జిల్లాలలో తక్కువ లేదా అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 1 నుంచి జూలై 17 మధ్య సాధారణ వర్షపాతం 162.6 మి.మీ. కాగా, రాష్ట్రంలో 106.3 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. కోస్తాంధ్ర ప్రాంతంలోని గుంటూరు, పల్నాడు, విజయనగరం జిల్లాలు.. మిగిలిన జిల్లాలలో తక్కువ లేదా భారీ లోటు వర్షపాతాన్ని నమోదు చేసినట్లు ఐఎండీ వెల్లడించింది.పశ్చిమ గోదావరి, అన్నమయ్య, యానాం జిల్లాల్లో 60 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా.. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 50 శాతం కంటే ఎక్కువ లోటు నమోదైంది. అలాగే తిరుపతి, కడప, బాపట్ల, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో 40 శాతం కంటే ఎక్కువ వర్షపాత లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అనంతపురం జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయికి సమానమైన 95.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నమోదైనట్లు వెల్లడించారు. రాయలసీమకు సంబంధించి సాధారణంగా కురవాల్సిన 119.9 మి.మీ వర్షపాతానికి బదులుగా 83.3 మి.మీ వర్షపాతం నమోదైందని.. ఇది 31 శాతం లోటని ఐఎండీ తెలిపింది.మరోవైపు జూలైలో రుతుపవనాల వేగం మందగించడంతో.. గత వారం రోజులుగా కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


# పొత్తులకు వైసీపీ ప్రయత్నాలు

విజయవాడ, జూలై 20, జగన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అనుకున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమి లో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్ కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్ కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం.వైసీపీ గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. 151 స్థానాల నుంచి 11కు పడిపోయింది. దీనికి కారణాలు ఏంటన్నవి అందరికీ తెలిసినా.. వైసీపీకి మాత్రం ఇంకా బోధపడలేదు. దీంతో ఇటు పార్టీలోను, అటు నాయకుల్లోనూ మార్పు కనిపించడం లేదన్న వాదన ఉంది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు కామనే అయినా.. కారణాలు తెలుసుకుని ముందుకు సాగాల్సిన అవసరం పార్టీలపై ఉంటుంది. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత లేదా పుట్టబోయే వ్యతిరేకత తమకు మేలు చేస్తుందని వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. వాస్తవానికి ఇది పార్టీ అధిష్టానంలోనే ఉంది. అందుకే క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే దారిలో నడుస్తున్నారు. దీంతో వైసీపీలో సరైన దిశానిర్దేశం లేకుండానే నాయకులు ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ పుంజుకునే విషయంలో ఇంకా వెనుక బడే ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో పార్టీకి భారీ ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైఖరి పార్టీకి కలిసి రాకపోగా.. వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీనిని సరిచేయాల్సి పార్టీ అధిష్టానం కూడా మౌనంగానే ఉండడం గమనార్హం. అంతా నేతలే చూసుకుంటారులే అనే ధోరణి అవలంభించడంతో పరిస్థితి ఇబ్బందిగానే ఉందన్నది పార్టీకి తెలిసినా.. నాయకులకు ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేవలం నలుగురైదుగురు నాయకులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు.సీమలో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక, ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణాలో ఒకరిద్దరు కూడా తక్కువగానే ఉన్నారు. గుంటూరులో అయితే.. అంబటి రాంబాబు కేంద్రంగానే వైసీపీ రాజకీయాలు సాగుతున్నాయి. ఇలా.. చేయడం వల్ల పార్టీపరంగా వచ్చే ఇమేజ్ మాట ఎలా ఉన్నా.. పోతున్న ఇమేజే ఎక్కువగా ఉంది. దీంతో రాజకీయంగా వైసీపీ పుంజుకోవడం కూడా కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ రెండేళ్లలో పార్టీ పెద్దగా పుంజుకున్నది అయితే లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# స్పోర్ట్స్ న్యూస్

## యమాల్ విజయం వెనుక నానమ్మ త్యాగం.. కష్టాల నుంచి ప్రపంచ స్టార్‌గా..!



లామినె యమాల్.. ఫిఫా ప్రపంచ కప్ 2026లో స్పెయిన్ తరపున చేసింది ఒక్కటే గోల్.. కానీ అతడి పేరు ఇప్పటికీ మార్మోగిపోతోంది. 18 ఏళ్లకే ఫిఫా కప్ నెగ్గిన జట్టులో సభ్యుడిగా నిలిచి రికార్డు నెలకొల్పాడు. ఫుట్‌బాల్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తోన్న ఈ యువ స్టార్ యమాల్.. తన విజయం వెనుక ఉన్న తన కుటుంబ త్యాగాలను గుర్తు చేసుకున్నాడు. బార్సిలోనా తరపున మెరుపులు మెరిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఈ స్పెయిన్ ఆటగాడు.. తన ఎదుగుదల వెనుక నానమ్మ ఫాతిమా చేసిన పోరాటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. చిన్నతనంలో ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబం పడిన ఇబ్బందులు తనను మరింత బలంగా తీర్చిదిద్దాయని యమాల్ తెలిపాడు.'నాకు అప్పుడు మూడేళ్లు. మా నానమ్మ ఫాతిమా.. మొరాకో నుంచి స్పెయిన్‌కు వలస వచ్చారు. ఒంటరిగా మా కుటుంబాన్ని మొత్తం ఆమె చూసుకునేవారు. రేయింబవళ్లు కష్టపడి మమ్మల్ని పోషించారు. మా భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేశారు. మా నాన్న, ఆయన సోదరి మొరాకోలో ఉండగా వారిని స్పెయిన్‌కు తీసుకురావడానికి డబ్బు కూడబెట్టింది' అని యమాల్ తెలిపాడు. ప్రస్తుతం బార్సిలోనా జెర్సీలో ప్రపంచ ఫుట్‌బాల్‌ను ఆకర్షిస్తున్న యమాల్ చిన్నతనం మాత్రం అంత సులభంగా సాగలేదు. కాటలోనియాలోని రొకాఫోండా అనే ప్రాంతంలో సాధారణ కుటుంబంలో పెరిగాడు. ఇప్పటికీ ఆ ప్రాంతాన్ని తన గుర్తింపుగా భావించే యమాల్.. గోల్ చేసిన ప్రతిసారీ ఓ ప్రత్యేక సంజ్ఞ ద్వారా అక్కడి పోస్టల్ కోడ్‌ను గుర్తు చేసుకుంటాడు.యమాల్ తల్లి ఈక్వటోరియల్ గినీ. యమాల్‌కు మూడేళ్ల వయసు ఉన్నప్పుడే భర్తతో విడిపోయింది. తల్లితోనే ఉండే యమాల్.. అప్పుడప్పుడు తండ్రి కోసం కాటాలోనియా వెళ్తుండేవాడు. ఆమె వెయిట్రెస్‌గా పనిచేసేవారు. 'మా అమ్మతో గడిపే సమయం చాలా తక్కువ. కానీ రాత్రిపూట ఎంత లేటైనా మా కోసం భోజనం సిద్ధం చేసేది. స్కూల్‌కు వెళ్లడం, ఇంటికి రావడం, మళ్లీ ట్రైనింగ్‌కు వెళ్లడమే నా దినచర్య. ఎప్పుడో రాత్రికి మా అమ్మను చూసేవాడిని' అని యమాల్ ఓ సందర్భంలో చెప్పాడు.బార్సిలోనా అకాడమీ లా మాసియా నుంచి వచ్చిన యమాల్ కేవలం 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టులోకి అడుగుపెట్టాడు. ఇప్పుడు ప్రపంచంలోని అత్యుత్తమ యువ ఆటగాళ్లలో ఒకడిగా నిలిచినా, తనకు నిజమైన ఆనందం కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండటమేనని చెబుతున్నాడు. 'మా అమ్మ సంతోషంగా ఉండటం చూస్తున్నా. నా తమ్ముడు నేను పొందలేని బాల్యాన్ని అనుభవించడం చూస్తున్నా. అదే నాకు అత్యంత ఆనందం. మా నాన్న ప్రశాంతంగా ఉండటం, నాన్నమ్మ తన ఇంట్లో సంతోషంగా ఉండటం... ఒక పిల్లవాడు తన కుటుంబం కోసం ఇంతకంటే గొప్పగా ఏం కోరుకోగలడు. ఎన్ని కష్టాలు వచ్చినా వాటినే బలంగా మార్చుకున్నా. నా తల్లిదండ్రులు, మా నానమ్మకు ఎప్పటికీ రుణపడి ఉంటా' అంటూ యమాల్ భావోద్వేగానికి గురయ్యాడు.

## 'టికీ-టాకా'కు కొత్త హంగులు.. స్పెయిన్ విజయ సూత్రమదే.!


ఫిఫా ప్రపంచ కప్-2026ను గెలుచుకోవడం ద్వారా స్పెయిన్ మరో ట్రోఫీని మాత్రమే అందుకోలేదు.. ప్రపంచ ఫుట్‌బాల్‌లో మరో స్వర్ణయుగానికి శ్రీకారం చుట్టిందనే అభిప్రాయాన్ని బలంగా వినిపించింది. ఆ జట్టు కోచ్ లూయిస్ డి లా ఫ్యూంటె నేతృత్వంలో యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల సమన్వయంతో బరిలోకి దిగిన స్పెయిన్.. ఆద్యంతం అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ అజేయంగా నిలిచింది. ఇక.. ఆ జట్టు సమష్టి విజయం సాధించడంలో మరో బలమైన ఆయుధమూ ఉంది. అదే టికీ-టాకా. ప్రత్యర్థి పూర్తిగా అలసిపోయేట్లు చేయడం, ఆపై వేటాడటం ఇందులో



ప్రధానం. స్టార్ ఆటగాళ్లు మెస్సి, రొనాల్డో, ఎంబాపెలనూ గోల్ కోసం చెమటోడ్చేలా చేసిన వ్యూహమది. నిజానికి మెస్సి, రొనాల్డోలకు దీనిపై అవగాహన ఉన్ననూ.. స్పెయిన్ ఆటతీరు చూస్తూ మిన్నకుండిపోయారు. ఈ వ్యూహంతోనే ఆ జట్టు పెద్దపెద్ద టైటిళ్లను ఎగరేసుకుపోయింది. 2010 ప్రపంచకప్ కూడా ఈ రకంగా దక్కినదే.ఇక.. టికీ-టాకా వ్యూహంలో స్పెయిన్ ఆటగాళ్లు మ్యాచ్ సమయంలో బంతిని వీలైనంత ఎక్కువ సేపు తమ అధీనంలోనే ఉంచుకుంటారు. సమీప దూరంలో త్రిభుజాకారంలో ఏర్పడి ఒకరికొకరు బంతిని పాస్ చేసుకుంటూ ఉంటారు. ఖాళీ ప్రదేశాలను సమర్థంగా వినియోగించుకుంటూ ప్రత్యర్థి జట్టు అసహనానికి గురయ్యేలా చేస్తారు. సుమారు 30 ఏళ్ల క్రితం బార్సిలోనా జట్టు దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చింది. 2010లో స్పెయిన్ ప్రపంచకప్ గెలవడంలో ఈ వ్యూహమే కీలక పాత్ర పోషించింది. ఆ తర్వాత కూడా ఆ జట్టును మరింత దుర్భేద్యంగా మార్చిందీ వ్యూహం. కానీ, రానురానూ ప్రత్యర్థి జట్లూ తమ డిఫెన్స్‌లను బలోపేతం చేసుకుని దీనికి విరుగుడు కనిపెట్టాయి. దీంతో స్పెయిన్ ఎక్కువగా పాస్‌లకే పరిమతమై, గోల్స్ చేయడంలో విఫలమైంది. ఫలితంగా 2018, 2022 ప్రపంచకప్‌ల్లో బోల్తాపడింది.ఈ నేపథ్యంలో స్పెయిన్ కోచ్‌గా లూయిస్ ఫుయెంటె బాధ్యతలు స్వీకరించాక 'టికీ-టాకా' కొత్త హంగులు సంతరించుకుంది. గతంలో పాస్‌లకే పరిమితమైన ఈ వ్యూహాన్ని ప్రత్యర్థి మోహరింపుల్లో గ్యాప్‌లను గుర్తించి దాడులు చేయడంపై స్పెయిన్ దృష్టి సారించింది. బంతిని అతిగా హోల్డ్ చేయకుండా గోల్ సాధించడంపై దృష్టి సారించింది. ఇందుకోసం యువ వింగర్లు యమాల్, విలియమ్స్ వంటి వారిని సానబట్టింది. ఇది ఆ జట్టుకు సత్ఫలితాన్ని ఇచ్చింది. మొత్తం 8 మ్యాచ్‌ల్లో 14 గోల్స్ సాధించిన స్పెయిన్.. ప్రత్యర్థికి ఒక్క గోల్ మాత్రమే సమర్పించుకుంది. ఇలా స్పెయిన్ జట్టు రెండోసారి ఫిఫా వరల్డ్ కప్‌ను ముద్దాడటంలో ఈ వ్యూహం కీలకపాత్ర పోషించింది.

## ఫిఫా ప్రపంచ కప్: పాపం మెస్సి.. అర్జెంటీనా విజయాలను వెంటాడిన వివాదాలు

ఫిఫా ప్రపంచ కప్ 2026లో అర్జెంటీనా సాధించిన విజయాలన్నింటినీ వివాదాలే వెంటాడాయి. రెడ్ కార్డ్‌ల నుంచి రిఫరీ నిర్ణయాలు ఆ జట్టుకే అనుకూలంగా ఉన్నాయంటూ వచ్చిన విమర్శల వరకు ఏదో ఒక వివాదం అర్జెంటీనాకు ఇబ్బందిగానే మారింది. అయినప్పటికీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆ జట్టు.. అద్భుత ప్రదర్శననే కనబర్చింది. కెప్టెన్ లియోనెల్ మెస్సి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కానీ ఆఖరి మెట్టుపై బోల్తా పడ్డాడు. ఫైనల్ మ్యాచ్ ముగిసే సరకు మెస్సి ముఖంలో కనిపించిన బాధ ఫుట్‌బాల్ అభిమానులను కదిలించింది. రెండో ప్రపంచ కప్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిన అర్జెంటీనా.. అదనపు సమయంలో గోల్ సమర్పించుకుని స్పెయిన్ చేతిలో ఓటమి పాలవ్వడంతో మెస్సి కల నెరవేరలేదు. దీంతో మైదానంలోనే భావోద్వేగానికి గురయ్యాడు.మరోవైపు అర్జెంటీనా ఆటగాళ్ల ప్రవర్తన తీవ్ర విమర్శలకు దారితీసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత స్పెయిన్ డిఫెండర్ ఎరిక్ గార్సియాను తోసివేసిన లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డు చూపించారు. దీంతో ఫైనల్‌లో అర్జెంటీనా ఆటతీరు మరోసారి చర్చనీయాంశమైంది. టోర్నీ మొత్తం మెస్సి తన అద్భుత ప్రదర్శనతో అభిమానులను అలరించినా, అర్జెంటీనా




విజయాలన్నింటినీ వివాదాలు వెంటాడాయి. ఈజిప్టుపై విజయంలో రిఫరీ నిర్ణయాలపై విమర్శలు రావడం, జోర్డాన్‌తో మ్యాచ్‌లో మెస్సి రెడ్ కార్డు నుంచి తప్పించుకున్నాడన్న చర్చ, దూకుడు ఆటతీరు... ఇలా ప్రతి మ్యాచ్‌లోనూ ఏదో ఒక వివాదం చోటుచేసుకుంది.ఫైనల్లో మెస్సి నుంచి ఆశించిన స్థాయి ప్రదర్శన రాలేదు. కొన్ని క్రాస్‌లు, ఒక ప్రమాదకర షాట్, స్పెయిన్ డిఫెండర్ మార్క్ కుకురెల్లాకు రెడ్ కార్డు ఇప్పించాలని చేసిన ప్రయత్నం మినహా అతని ప్రభావం పెద్దగా కనిపించలేదు. గోల్డెన్ బూట్ రేసులో తీవ్రమైన పోటీ ఇచ్చిన మెస్సి.. ఆఖరి రెండు మ్యాచుల్లో ఒక్క గోల్ కూడా చేయలేకపోవడం గమనార్హం. తన కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలను జట్టుకు అందించిన మెస్సికి.. ఈ ప్రపంచ కప్ ఆశించిన ముగింపు కాకపోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

## టెన్నిస్ క్రీడాకారిణులకు జన్యు పరీక్షలు.. ఎందుకో తెలుసా..?



మహిళల టెన్నిస్‌లో విప్లవాత్మక నిర్ణయంతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది మహిళల టెన్నిస్ సంఘం (ఛిం). ఇక నుంచి క్రీడాకారిణులకు జన్యు పరీక్షలను తప్పనిసరి చేసింది. లింగ నిర్ధారణ కోసం ఎస్‌ఆర్‌వై (లింగ నిర్ధారణ ప్రాంతం టెస్టు ద్వారా వారి నుంచి ధ్రువీకరణ పొందనుంది. అయితే.. మహిళల టోర్నీల్లో పోటీకి ముందు కెరీర్లో ఒకసారే ఎస్‌ఆర్‌వై పరీక్ష చేయాలని డబ్ల్యూటీఏ స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన జూలై 21, మంగళవారం నుంచి అమలులోకి రానుంది.టెన్నిస్ క్రీడాకారిణులకు జన్యు పరీక్షలను తప్పనిసరి చేసింది మహిళల టెన్నిస్ సంఘం. ఇక నుంచి మహిళల ఈవెంట్లలో పోటీపడాలంటే లింగ నిర్ధారణ కోసం ఎస్‌ఆర్‌వై(లింగ నిర్ధారణ ప్రాంతం జ) టెస్టు చేయించుకోవాలని డబ్ల్యూటీఏ తెలిపింది.క్రీడాకారిణులు చెంపలు(బుగ్గలు), రక్త నమూనాల నుంచి ఎస్‌ఆర్‌వై జన్యువును తీసి.. టెస్టు చేస్తారు. అయితే.. ఎవరికైనా కెరీర్లో ఒక్కసారే ఈ జన్యు పరీక్ష చేయనున్నారు. ఈ కొత్త నిబంధనతో.. గతంలో మాదిరిగా ట్రాన్స్‌జెండర్లను మహిళల విభాగంలో పోటీపడేందుకు అనుమతివ్వడం కుదరదని డబ్ల్యూటీఏ తేల్చేసింది.'డబ్ల్యూటీఏ టోర్నమెంటల్లో పాల్గొనే మహిళా టెన్నిస్ ప్లేయర్లకు ఎస్‌ఆర్‌వై జన్యువు కోసం ఏకకాల స్క్రీనింగ్ టెస్టును బట్టి అర్హత ఉందో లేదో నిర్ధారిస్థాం. ప్లేయర్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలోభాగంగా ఈ కొత్త విధానాన్ని తీసుకొస్తున్నాం. అత్యంత గోప్యంగా, అత్యుత్తమ ప్రమాణాలతో ఈ టెస్టు జరుపుతాం. ఇది చాలా సున్నితమైన అంశం కాబట్టి.. గౌరవంగా చూస్తాం' అని రాయిటర్స్ వార్తా సంస్థతో డబ్ల్యూటీఏ పేర్కొంది.అంతర్జాతీయంగా ఇతర క్రీడల్లోనూ మహిళలకు జన్యు పరీక్షలు తప్పనిసరి చేసినందున తాము ఈ పద్ధతికి మొగ్గు చూపామని డబ్ల్యూటీఏ స్పష్టం చేసింది. మహిళల అథ్లెటిక్స్‌లో పోటీపడే వారు కచ్చితంగా జన్యు టెస్టు చేసుకోవాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధన పెట్టిన విషయం తెలిసిందే.

## ఫిఫా వరల్డ్‌కప్.. ఎవరెవరికి అవార్డులు దక్కాయంటే




న్యూయార్క్: ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్ట్‌లతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హమ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టను వరించింది.

## రో-కో భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వండి.. బీసీసీఐకి యువరాజ్ సింగ్ సూచన

భారత స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించాలని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ బీసీసీఐ, టీమ్ మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. వన్డే ప్రపంచ కప్ 2027 ప్రణాళికల్లో ఈ ఇద్దరు ప్లేయర్లు ఉంటారా? లేదా? అన్న విషయాన్ని స్పష్టంగా వెల్లడించాలని కోరాడు. ఇప్పటికే టీ20, టెస్టు ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రో-కో.. వన్డేల్లోనే



కొనసాగుతున్న సంగతి తెలిసిందే. టీమ్ మేనేజ్‌మెంట్ యువ ప్లేయర్ల వైపు మొగ్గుచూపుతుండటం, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా రో-కో ఇబ్బంది పడుతుండటంతో రిటైర్‌మెంట్ వార్తలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో యువీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.'ఇప్పుడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉన్న పరిస్థితిని నేను కూడా ఎదుర్కొన్నాను. వాళ్లు ఆడాలా? వద్దా? అని బయటివాళ్లు తీర్పు ఇవ్వడం సరైంది కాదు. ఆ నిర్ణయం జట్టు యాజమాన్యం, కోచ్, సెలక్టర్ల మీదే ఆధారపడి ఉంటుంది. రో-కోని 2027 ప్రపంచ కప్ వరకు కొనసాగించాలన బీసీసీఐ భావిస్తే.. వారికి పూర్తి భరోసా కల్పించాలి. వారి భుజంపై చేయి వేసి.. 'మేము మీ వెంటే ఉంటాం.. ఒత్తిడి లేకుండా మీ సహజ ఆట ఆడండి. ఒక సిరీస్‌లో విఫలమైనంత మాత్రానా జట్టులో స్థానం కోల్పోతామని భావించకండి' అని వారికి చెప్పాలి' అని యువీ వెల్లడించాడు.'ఒకవేళ వారిని ఆడించలేమని అనుకుంటే.. అదే విషయాన్ని నిజాయితీగా చెప్పేసేయండి. కోచ్, కెప్టెన్, సెలెక్టర్లు... ఎవరు అయినా సరే ఆటగాడికి స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. నాకు ఆ స్పష్టత లేకపోవడం బాధ కలిగించింది. ఎన్నో ఏళ్లు దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆటగాడికి అలాంటి పరిస్థితి రావడం మంచిది కాదు. ఎవరైనా మీ ప్రణాళికల్లో లేకపోతే నిజాయితీగా ముఖాముఖిగా చెప్పండి.




# ఓటిటిలోకి బాలన్..ది బాయ్




'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ – ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ – ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.




# విడాకుల తర్వాత నిహారికకి కలిసొచ్చిందా.. తండ్రికి తగ్గ తనయ!

ఈ మధ్యకాలంలో కొంతమంది సెలబ్రిటీల విషయంలో చోటు చేసుకుంటున్న అనూహ్య పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇకపోతే ఈ మధ్యకాలంలో నాగచైతన్య, అఖిల్ అక్కినేని, సమంత లాంటి సెలబ్రిటీలు వివాహం తర్వాత మంచి సక్సెస్ ను అందుకొని దూసుకుపోతుంటే.. మరికొంతమంది తమ భాగస్వాములకు విడాకులు ఇచ్చిన తర్వాత మరింత జోరు పెంచారు. అలాంటి వారిలో నిహారిక కూడా ఒకరు. పెద్దలు కుదిర్చిన వివాహాన్ని చేసుకున్నా.. ఆ పెళ్లి మూన్నాళ్ల ముచ్చటగానే మిగలగా.. ఆ తర్వాత ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్న మెగా డాటర్ ఇప్పుడు రెట్టింపు వేగంతో దూసుకొచ్చి ఏకంగా నేషనల్ అవార్డును అందుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. టీవల జూలై 18వ తేదీన న్యూఢిల్లీ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు చిత్రానికి ఏకంగా రెండు నేషనల్ అవార్డులు లభించాయి .ఒకటి ఉత్తమ ప్రాంతీయ చిత్రం కాగా.. మరొకటి బెస్ట్ మేకప్ విభాగంలో నేషనల్ అవార్డులు లభించడంతో పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజన్స్ నిహారికపై అలాగే కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఓనీలతివబ ఇకపోతే ఇదే సమయంలో నాగబాబుకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 38 ఏళ్ల తర్వాత తండ్రి రికార్డును నిహారిక రీ క్రియేట్ చేసింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. 1988లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా కే బాలచందర్ దర్శకత్వం వహించిన రుద్రవీణ చిత్రాన్ని.. నిర్మాతగా నాగబాబు నిర్మించారు. అయితే ఈ సినిమా కమర్షియల్ గా ప్రేక్షకులను మెప్పించలేదు. కానీ ఏకంగా నేషనల్ అవార్డులను అందుకొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ చిత్రం మూడు విభాగాలలో నేషనల్ అవార్డును అందుకుంది.



# స్పిరిట్ వంగా అప్డేట్.. సినిమా కోసం నెక్స్ట్ లెవెల్ వెయిటింగ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేతిలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల లిస్ట్ చూస్తే, రాబోయే రెండేళ్ల పాటు ఇండియన్ బాక్సాఫీస్‌లో ఆయన హవా కొనసాగడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఆడియన్స్ ముందుకు రానున్న ఫౌజీపై భారీ అంచనాలుండగా, ఆ వెంటనే స్పిరిట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రెండు సినిమాలు జానర్ పరంగా భిన్నంగా ఉండటంతో పాటు, ప్రభాస్ కెరీర్‌లో మరో కొత్త దశను ఆవిష్కరిస్తాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. రీసెంట్ గా స్పిరిట్ సినిమాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ పై డైరెక్టర్ నుంచి వచ్చిన ఇన్ఫర్మేషన్ ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆల్రెడీ స్పిరిట్ షూటింగ్ 40% పూర్తైందని ఆయన చెప్పారు. మూవీ అనుకున్న ప్లాన్ ప్రకారమే ముందుకు సాగుతోందనే సంకేతాలు కనిపించడంతో, 2027 రిలీజ్‌పై నమ్మకం మరింత బలపడింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల లిస్ట్ లో చోటు సంపాదించుకున్న ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో డిస్కషన్ కూడా వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ విదేశాల్లో హాలీడేస్ ను ఎంజాయ్ చేస్తున్నప్పటికీ, తిరిగొచ్చిన వెంటనే ఆయన షెడ్యూల్ మళ్లీ బిజీ కానుంది. ముందుగా ఫౌజీ షూటింగ్ కు డేట్స్ కేటాయించి, తర్వాత స్పిరిట్ తర్వాతి షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. భారీ స్థాయి సినిమాలను సమాంతరంగా సమన్వయం చేస్తూ ముందుకు సాగడం ప్రభాస్ కెరీర్‌లో ప్రత్యేకంగా కనిపిస్తోంది. మరోవైపు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా వర్కింగ్ స్టైల్ కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా తన సినిమాలకు సంబంధించిన షూటింగ్ వివరాలను తరచుగా బయటపెట్టని ఆయన, అవసరమైన సందర్భాల్లో మాత్రమే రియాక్ట్ అవుతారనే సంగతి తెలిసిందే. అందుకే స్పిరిట్ షూటింగ్ పై ఆయన డైరెక్ట్ గా మాట్లాడటం ఫ్యాన్స్ లో మరింత ఆసక్తిని పెంచింది. సినిమా గురించి చిన్న అప్డేట్ వచ్చినా పెద్ద డిస్కషన్ గా మారే స్థాయిలో ఈ కాంబినేషన్‌పై అంచనాలు నెలకొన్నాయి. దీంతో మరో ఇంట్రెస్టింగ్ విషయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. షూటింగ్ వర్క్స్ శరవేగంతో సాగుతున్నాయంటే, ఇక ఫస్ట్ లుక్ ఎప్పుడు? టీజర్ రిలీజ్ కు ఇంకా ఎంత టైముంది? అనే డిస్కషన్ ఫ్యాన్స్ లో మొదలైంది. అఫీషియల్ అనౌన్స్‌మెంట్స్ ఇంకా రాకపోయినా, ప్రతి చిన్న అప్‌డేట్‌ను సెలబ్రేట్ చేసే స్థాయికి ఈ సినిమాపై క్రేజ్ పెరిగింది. 2027 బాక్సాఫీస్ రేసులో స్పిరిట్ కీలక పోటీదారుగా నిలిచే అవకాశాలపై ఇప్పటికే సినీ వర్గాల్లో విశ్లేషణలు మొదలయ్యాయి.

# గాడ్ ఆఫ్ వార్ లో ఆ క్రేజీ బ్యూటీ!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి పాన్ ఇండియా సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో? చెప్పాల్సిన పనిలేదు. 'డ్రాగన్' విజయం సాధిస్తే తారక్ పాన్ ఇండియా ఇమేజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది. ఈ నేపథ్యంలో ఆ ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని గురూజీ గాడ్ ఆఫ్ వార్ చిత్రాన్ని తెరకెక్కించాల్సి ఉంటుంది. అందుకు అన్ని రకాలుగా గురూజీ సిద్దంగానే ఉంటారు. ఇప్పటికే సినిమా కాన్సెప్ట్ లీక్ అయింది. కార్తికేయ స్వామి నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ పాత్రకు సంబంధించి తారక్ ప్రిపరేషన్స్ కూడా మొదలు పెట్టేసాడు. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ? ఎవరు అన్నది ఇంతవరకూ ఎక్కడా చర్చకు రాలేదు. తారక్ ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉండటం..త్రివిక్రమ్ ఆదర్శ కుటుంబం సినిమాతో తల మునకలై ఉండటంతో? గాడ్ ఆఫ్ వార్ కు సంబంధించిన విషయాలు పెద్దగా చర్చకు రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాణీ పేరు బలంగా వినిపిస్తోంది. ఇంత వరకూ కియారా– తారక్ కాంబినేషన్ ఏ సినిమా కోసం చేతులు కలిపింది లేదు. ఇదే తొలిసారి కావడంతో? ఆసక్తికరంగా మారింది. కియారాకు పాన్ ఇండియా ఇమేజ్ ఉంది. ంటలవతీబితిబవఎవనిబి అమ్మడు హీరోయిన్‌గా నటిస్తోన్న 'టాక్సిక్' విజయం సాధిస్తే ఆ ఇమేజ్ రెట్టింపు అవుతుంది. ఇవన్నీ దృష్టి లో పెట్టుకునే గురూజీ కియారాకి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రత్యేకత ఉంటుంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను అద్భుతంగా తీర్చిదిద్దుతారు. కియారా అద్వాణీకి ఉన్న స్టార్ ఇమేజ్, ఎన్టీఆర్ స్థాయికి సరిగ్గా సరిపోతుందని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. తారక్ ఈ సినిమా కోసం లుక్ .. మేనరిజమ్స్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

# చిన్న సినిమాలకు అండగా పాన్ వరల్డ్ దర్శకులు!

ప్రస్తుతం టాలీవుడ్ లో ఎన్నో కొత్త మార్పులు కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి ఈ రెండు మూడేళ్ల కాలంలో వస్తోన్న మార్పులు పరిశ్రమను మరింత ముందుకు తీసుకెళ్తున్నాయి. ఒకప్పుడు తమ సినిమాలకే పరిమితమైన అగ్ర దర్శకులు ఇప్పుడు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నారు. రాజమౌళి, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగ, సుకుమార్ వంటి స్టార్ డైరెక్టర్లు చిన్న సినిమాల నిర్మాణంలో భాగస్వాములవుతూ వాటికి తమ బ్రాండ్ వాల్యూను జోడిస్తున్నారు. ఇది చిన్న సినిమాల బడ్జెట్ పెంచడమే కాకుండా? మార్కెట్‌లో వాటికి క్రేజ్ తీసుకు రావడానికి ఎంతగానో దోహదపడుతోంది. టాలీవుడ్వార్తలు అవకాశాలు అందుకోలేని భామలు! దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తనదైన శైలిలో ఈ మార్పుకు శ్రీకారం చుట్టారు. ఆయన తన కుమారుడు కార్తి కేయ నిర్మిస్తోన్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' వంటి వైవిధ్యభరితమైన ప్రాజెక్ట్ కు సమర్పకుడిగా వ్యవహరించి ప్రత్యేకమైన గుర్తింపునిస్తున్నారు. భారీ చిత్రాలను రూపొందించే క్రమంలో జక్కన్న అనుభవం, మార్కెట్ అవగాహన చిన్న సినిమాలకు ఆక్సిజన్‌లా పని చేస్తుంది. ఒక స్టార్ దర్శకుడి పేరు తోడైతే? ఆ సినిమాపై ప్రేక్షకుల్లో ఉండే అంచనాలు అంతకంతకు పెరుగాయన్నది వాస్తవం.'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి భారీ చిత్రాలతో పాన్ ఇండియాని శాసించిన ప్రశాంత్ నీల్ కూడా ఈ కొత్త ఒరవడిలో భాగమయ్యారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో వస్తోన్న హారర్ థ్రిల్లర్ '418' చిత్రానికి మద్దతుగా నిలుస్తున్నారు. ఒక మాస్ దర్శకుడు థ్రిల్లర్ జానర్‌ను ప్రోత్సహించడం అనేది పరిశ్రమలో కొత్త ఊపును తెస్తోంది. ప్రశాంత్ నీల్ వంటి దర్శకుల మద్దతు ఉండటం వల్ల చిన్న చిత్రాలు కూడా పెద్ద స్థాయిలో ప్రమోషన్ పొందే అవకాశం దక్కుతోంది. ఇది చిన్న నిర్మాతల భయాన్ని పోగొట్టి కొత్త కథలను నమ్మి ముందుకు వచ్చేలా చేస్తోంది. సందీప్ రెడ్డి వంగ సైతం తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న 'రోమాకం' అనే రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను స్వయంగా నిర్మిస్తున్నారు. ఆ రకంగా సందీప్ కొత్తవారికి తనదైన ప్లాట్‌ఫామ్‌ను కల్పిస్తున్నారు. కమర్షియల్ హంగులతో కూడిన రొమాంటిక్ కథలకు సందీప్ రెడ్డి వంగ మార్క్ తోడైతే ఆ సినిమా యువతను ఆకట్టుకుంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రతిభ ఉన్న యువతను వెతికి మరీ అవకాశాలు ఇవ్వడం సందీప్ గొప్పతనానికి నిదర్శనం.ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో సుకుమార్ ఎప్పుడూ ముందుంటారు. 'సుకుమార్ రైటింగ్స్' ద్వారా ఆయన ఇప్పటికే ఎంతోమంది కొత్త దర్శకులను, నటులను వెండితెరకు పరిచయం చేశారు. ఒక స్టార్ దర్శకుడు చిన్న సినిమాల నిర్మాతగా మారడం వల్ల ఆ సినిమాల మేకింగ్ క్వాలిటీ, స్క్రిప్ట్ విషయంలో మరింత స్పష్టత వస్తోంది. సీనియర్ దర్శకుల సలహాలు, సూచనలు చిన్న సినిమాలకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. ఇది పరిశ్రమలో ఆరోగ్యకరమైన పోటీని సృజనాత్మకతను పెంపొందిస్తోంది. సినిమాసమీక్షలు స్టార్ దర్శకుల సహకారం వల్ల టాలీవుడ్ భవిష్యత్తు మరింత సుసంపన్నం కానుంది. ఇది సినిమాల నిర్మాణానికే పరిమితం కాకుండా మంచి కథకు గ్లోబల్ రీచ్ ఇచ్చేలా చేస్తోంది. చిన్న సినిమాలకు అగ్ర దర్శకులు దన్నుగా నిలవడం వల్ల కొత్త కథలు, కొత్త ఆలోచనలు వెలుగు చూస్తున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే టాలీవుడ్ ప్రపంచ సినిమా స్థాయిలో మరిన్ని అద్భుతాలను సృష్టించే అవకాశం ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**